UDYAM-TS-02-0308842
www.prathighatana.com

ప్రతిఘటన

తెలుగు దిన పత్రిక
జనం కోసం..

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 35 | పేజీలు : 8 | సోమవారం 2 మార్చి 2026 | వెల : 4/-

ఇరాన్ టాప్-లీడర్‌షిప్ ఖతం..
ఖమేనీ సహా 40 మంది కమాండర్లు హతం..

ప్రతిఘటన, నేషనల్ బ్యూరో

ఇజ్రాయిల్, అమెరికాలు ఇరాన్‌పై తమ దాడుల్ని తీవ్రం చేశాయి. శనివారం జరిగిన దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతొల్లా అలీ ఖమేనీ హతమయ్యారు. మరోవైపు, ఇరాన్ పశ్చిమాసియా అంతటా ప్రతీకార దాడులకు చేస్తోంది. ముఖ్యంగా ఇరాన్ తన పొరుగున ఉన్న గల్ఫ్ దేశాలైన యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, ఖతార్, బహ్రైయిన్, జోర్డాన్, ఇరాక్ లోని యూఎస్ స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. మిస్సైళ్లు, డ్రోన్ దాడులతో వణికిస్తోంది.ఇదిలా ఉంటే, ఇజ్రాయిల్ దాడుల్లో ఇరాన్ టాప్ నాయకత్వం అంతా మరణించినట్లు ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) ప్రకటించింది. రెండో రోజు ఇరాన్‌ను నిర్వీర్యం చేశామని, దాని రాజకీయ సైనిక నాయకత్వాన్ని పూర్తిగా నాశనం చేసినట్లు చెప్పింది. ఇప్పటికే ఇరాన్ - మిగతా3లో

కవితకు కేసీఆర్ మరో ఛాన్స్?

- ఫ్యామిలీ వివాదాలకు చెక్ పెట్టాలని నిర్ణయం
- కవిత పార్టీని వీడటంపై గులాబీ దళంలోనూ అసంతృప్తి
- కేసీఆర్ సన్నిహితుల ద్వారా కూతురికి పిలుపు?
- కవిత వెనక్కు వెళ్తారా..? వెళ్తే ఆమె పొజిషన్ ఏంటి?
- హరీష్ రావు, సంతోష్ రావులు పరిస్థితి ఎలా ఉండనుంది?
- కాంగ్రెస్, బీజేపీలకు విమర్శనాస్త్రాలు అందించకుండా ప్లాన్

ప్రతిఘటన, హైదరాబాద్

గులాబీ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఎప్పుడు మళ్లీ యాక్టివ్ పాలిటిక్స్ చేస్తారా? అని అటు పార్టీ కేడర్, కీలకనేతలు ఎదురుచూస్తున్నారు. బీఆర్ఎస్ అంటే అభిమానం ఉన్న ప్రజలు సైతం తమ ప్రియతమ నేత మరల క్రియాశీలక రాజకీయాలు చేయాలని, తామంతా ఆయనే వెంటే ఉన్నామన్న సంకేతాలను పంపిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికలకు ముందు ఫాంహౌస్ వీడి బయటకు వచ్చిన కేసీఆర్..మూడు జిల్లాల్లో సభలు నిర్వహిస్తామని ప్రకటించారు. ముఖ్యంగా కృష్ణా నదీ పారే జిల్లాల్లో సభలు నిర్వహించి ఏపీ చేస్తున్న జలదోపిడీ.. రేవంత్ సర్కార్ సహకరిస్తున్న తీరును వివరిస్తామని చెప్పారు. కాగా, నాటి నుంచి నేటివరకు మరోసారి సభల ప్రస్తావన రాలేదు. కేసీఆర్ కాదు కదా.. కేటీఆర్, హరీశ్ రావు సైతం వీటి గురించి ఎలాంటి హింట్ ఇవ్వలేదు.అసలు నిర్వహిస్తారా? లేదా? ఉంటే ఎప్పుడు అనేది కూడా క్లారిటీ ఇవ్వలేకపోయారు. ఇదిలాఉంటే తాజాగా కవితకు లిక్కర్ స్కామ్ కేసులో క్లీన్ చిట్ రావడంతో కేసీఆర్ ఏం స్పందిస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొన్నది. - మిగతా3లో

తెలుగు ప్రజల కోసం
రంగంలోకి రేవంత్

- యుద్ధం జరుగుతున్న దేశాల్లో ఉన్న తెలంగాణ పౌరుల క్షేమంపై ఫోకస్
- భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలు పాటించండి
- గల్ఫ్ దేశాల్లో ఉన్న తెలంగాణ వాసుల పరిస్థితిని పరిశీలిస్తున్నాం
- తెలుగు ప్రజలను సురక్షితంగా వెనక్కి రప్పించేందుకు సిద్ధంగా ఉన్నాం
- విదేశాల్లో ఉన్న భారత ఎంబసీలు, కాన్సులేట్లతో సీఎం చర్చలకు ఆదేశం

ప్రతిఘటన, హైదరాబాద్

పశ్చిమ ఆసియాలో యుద్ధ జ్వాలలు పెను సంక్షోభానికి దారితీస్తున్నాయి. అమెరికా.. ఇజ్రాయెల్ జరిపిన భీకర దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మరణించడంతో ఆ దేశం రగిలిపోతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరాన్ సహా గల్ఫ్ ప్రాంతాల్లో ఉన్న తెలుగు ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. యుద్ధం ముదురుతున్నట్లు వస్తున్న వార్తలను దృష్టిలో ఉంచుకుని.. అక్కడ నివసిస్తున్న వారు భద్రతా మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఆయా దేశాల్లోని భారత రాయబార - మిగతా3లో

మావోయిస్టు సాంబయ్య మరో 14 మందితో కలిసి సరెండర్

ప్రతిఘటన, హైదరాబాద్

తెలంగాణ ప్రాంతానికి చెందిన సీనియర్ మావోయిస్టు ముప్పిడి సాంబయ్య అలియాస్ వికాస్ సహా మొత్తం 15 మంది చత్తీస్‌గడ్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. వరంగల్ జిల్లా తరాలపల్లి గ్రామానికి చెందిన ముప్పిడి సాంబయ్య అలియాస్ వికాస్ ప్రస్తుతం ఒడిశా రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. దీంతో పాటు బీబీఎం (బొలాంగీర్-బార్‌గఢ్-మహాసముంద్) డివిజన్ కీలక నేతగానూ ఉన్నారు. ఈయనతో పాటు పలువురు డివిజినల్ కమిటీ - మిగతా3లో

ఐదున్నర దశాబ్దాల తర్వాత
సొంతూరికి మల్లోజుల

1970లో అడవిబాటపట్టిన మల్లోజుల వేణుగోపాల్ రావు

ఆయన వెంట ఎస్పీ స్థాయి అధికారితోపాటు 9 మంది పోలీసులు

తన సోదరుడిని పరామర్శించడానికి వచ్చిన మల్లోజుల

పెద్దపల్లిలో తలపించిన పండుగ వాతావరణం

ప్రతిఘటన, కరీంనగర్

మల్లోజుల వేణుగోపాల్ రావు ఐదున్నర దశాబ్దాల తర్వాత సొంతూరుకు చేరుకున్నారు. 1970లో అడవిబాటపట్టిన మల్లోజుల మావోయిస్టు పార్టీలో కేంద్ర కమిటీ సభ్యుడిగా, అధికార ప్రతినిధిగా ఎదిగారు. గత సంవత్సరం అక్టోబర్ 14న మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ ఎదుట భారీగా ఆయుధాలు, అనుచరులతో సహా లొంగిపోయారు. అజ్ఞాతం వీడాక పోలీసు బందోబస్తు మధ్య గడ్చిరోలిలో ఉంటున్న వేణుగోపాల్ రావు ఐదు నెలల తర్వాత తొలిసారిగా పెద్దపల్లిలో తన సొంత ఇంటికి చేరుకొని స్నేహితులు, బంధువులను కలిశారు. - మిగతా3లో

చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌పై పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ ఫిర్యాదు

తిరుమల శ్రీవారి లడ్డుపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్నారంటూ పిటిషన్

నారా లోకేష్, టీటీడీ ఈఓ శ్యామలరావు, చైర్మన్ బీఆర్ నాయుడుపై కూడా..

ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా అధినేతలపైనా కంప్లైంట్

పుల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన దేవరకొండ నాగవర ప్రసాద్

వివరాలు 3లో..

ఫిబ్రవరిలోనే సెగలు..
రికార్డ్ బ్రేక్.!

- ఫిబ్రవరిలోనే 6,057 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదు
- గత ఏడాది రికార్డును బద్దలు కొట్టిన విద్యుత్ వినియోగం
- 35 కొత్త సబ్‌స్టేషన్లు, 366 ట్రాన్స్‌ఫార్మర్లతో మౌలిక సదుపాయాల బలోపేతం
- వేసవి డిమాండ్‌ను తట్టుకునేందుకు పూర్తి సన్నద్ధతతో సంస్థ

నల్లగొండ నుంచి ఫ్లోరైడ్‌ను పూర్తిగా
నిర్మూలిస్తాం

- ఎస్ఎల్‌బీసీ స్వరంగం పనులు 2028 నాటికి పూర్తి
- బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టుకు కొత్త ఊపు..
- చెరువులు నింపే దిశగా అడుగులు
- రహదారుల విస్తరణతో జిల్లాలో సమగ్ర అభివృద్ధి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటన

ప్రతిఘటన, నల్లగొండ

నల్లగొండ జిల్లాలో దశాబ్దాలుగా ప్రజలను పీడిస్తున్న ఫ్లోరైడ్ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పునరుద్ఘాటించారు. నల్లగొండ మండలం రాముల బండలో జరిగిన శ్రీ సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న సందర్భంగా

ఆయన జిల్లా అభివృద్ధి , సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై కీలక వ్యాఖ్యలు చేశారు.నల్లగొండ జిల్లాకు వరప్రదాయిని అయిన ఎస్ఎల్బిసి స్వరంగం పనులపై మంత్రి స్పష్టతనిచ్చారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులు ప్రారంభించినప్పటికీ, దురదృష్టవశాత్తూ జరిగిన ప్రమాదం వల్ల ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారని, దాంతో పనులు నిలిచిపోయాయని - మిగతా3లో

ఒక్క కొత్త ఇల్లు కట్టినట్లు నిరూపించినా..
రాజకీయ సన్యాసం తీసుకుంటా..

- మాజీ మంత్రులతో కలిసి 'మూసీ దండియాత్ర'..
- మూసీ ప్రాజెక్టు బాధితులకు అండగా నిలుస్తామని ప్రకటన
- కేకే నగర్ ఫేజ్-2 నుండి మధుపార్క్ రిడ్జ్ వరకు సాగిన పాదయాత్ర
- సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్

డీఎంకే అధికార స్వప్నాలు పీడకలలుగా మారడం ఖాయం

తమిళనాడులో ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార డీఎంకేపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. తిరిగి అధికారంలోకి వస్తామని చెబుతున్న డీఎంకేకు అది పీడకలగానే మిగిలిపోతుందని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికలు రాష్ట్రానికి కీలక టర్నింగ్ పాయింట్?గా మారుతుందని అభిప్రాయపడ్డారు. మదురైలో నిర్వహించిన ఎన్‌డీఏ ర్యాలీలో ఆయన ప్రసంగించారు. "తమిళనాడులో తిరిగి అధికారంలోకి వస్తామని కొందరు కలలు కంటున్నారు. కానీ ఎన్?డీఏ ర్యాలీని చూస్తే వారి కలలు పీడకలలగానే మిగిలిపోతాయి. ఈ అసెంబ్లీ ఎన్నికలు తమిళనాడుకు టర్నింగ్ పాయింట్. డీఎంకేను ఇంటికి పంపాలని ఇప్పటికే ప్రజలు నిశ్చయించుకున్నారు. ఎన్?డీఏ ప్రభుత్వంతోనే మార్పు సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది ఎన్?డీఏ ప్రభుత్వమే. 25ఏళ్ల తర్వాత 2021లో పూర్తి మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. కానీ వారు సరైన సుపరిపాలనను అందించలేదు. మొత్తం రాష్ట్రాన్ని లూటీ చేశారు. వారసత్వ రాజకీయాల గురించి ఆలోచిస్తూ ప్రజల ఆకాంక్షలను పట్టించుకోలేదు. మదురైను ప్రేమించిన ఎంజీఆర్?తో ఇక్కడి ప్రజలు అండగా నిలిచారు. అందుకే డీఎంకేకు మదురై అంటే ఇష్టం లేదు. ఇంకా మదురైకు మాఫియా తరహా రాజకీయాలను తీసుకువచ్చారు. డ్రైనేజీ, చెత్త నిర్వహణ సరిగ్గా లేదు. జాతీయ శుభ్రత ర్యాకింగ్స్?లో అట్టడుగు స్థానానికి తీసుకెళ్లింది. అవినీతి వల్ల మేయర్ కూడా రాజీనామా చేయాల్సి వచ్చింది. డీఎంకే పేదల కోసం పనిచేయదు ఇతరులను కూడా చేయనియ్యదు. తమిళనాడులో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద దాదాపు ఆరు లక్షల ఇళ్లు పూర్తయ్యాయి. ఆ కుటుంబాలకు సొంత ఇల్లు వచ్చి గౌరవంతో ఉంటున్నారు. ఇదే సమయంలో మరో మూడు లక్షల ఇళ్లు ఇప్పటికీ పెండింగ్?లోనే ఉన్నాయి. డీఎంకే ప్రభుత్వం సర్వేలు చేయకుండా కాలయాపన చేయడమే కారణం. డీఎంకే చిల్లర రాజకీయాల వల్ల పేద కుటుంబాలు ఎందుకు ఇబ్బందులు పడాలి."

"తమిళనాడులోని మహిళలు కష్టాల్లో చిక్కుకుపోయారు. రాష్ట్రంలో రోజురోజుకూ క్రైమ్? పెరిగిపోతుంది. ఆల్కహాల్, డ్రగ్? మాఫియాతో తమ కుటుంబాలు నాశనం అవ్వడాన్ని వారుక ల్లారా చూస్తున్నారు. అమ్మ జయలలిత పాలనలో ఎంత మెరుగ్గా జీవించామో అని వారు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారు. అయితే, ప్రతీ ఒక్క తమిళ తల్లి, సోదరి, కూతురుకి ఒక మాట ఇస్తున్నాను. ఎన్?డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటగా రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్?పై దృష్టి పెడతాం. డ్రగ్? మాఫియా, క్రిమినల్స్?ను జైలులో వేస్తాం. మహిళల అభివృద్ధికి, సాధికారతకు ఎన్?డీఏ ఎప్పుడూ కట్టుబడి ఉంటుంది." అని మోదీ అన్నారు.

"రామేశ్వరానికి ఉన్న పాత పంబాన్? బ్రిడ్జ్?కు దాదాపు వందేళ్లు పూర్తయ్యాయి. ఇంత కాలం తర్వాత దానిని మార్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. కానీ డీఎంకే, కాంగ్రెస్? కూటమి 2004 నుంచి 2014 వరకు పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేసింది? రైళ్లు చాలా నిధానంగా వెళ్లాల్సి వచ్చేది. ఇంకా ప్రభుత్వ ఫైళ్లు కూడా దానికంటే మెల్లగా కదిలేవి. కానీ మా ప్రభుత్వం ఆధునిక పాంబన్? బ్రిడ్జ్?కు అనుమతులు ఇచ్చాం. గతేడాది దానిని ప్రారంభించే అదృష్టం నాకు దక్కింది. మా పనితీరులో వేగాన్ని ప్రదర్శించాం. అందుకే ఇప్పుడు రైళ్లు కూడా వేగంగా పరిగెడుతున్నాయి. 2009 నుంచి 2014 మధ్య డీఎంకే, కాంగ్రెస్? పాలనలో తమిళనాడుకు రూ. 880 కోట్లు కేటాయించారు. ఒక్క 2026-27 ఆర్థిక సంవత్సరంలోనే రూ. 7,600 కోట్లు కేటాయించాం. ఇది దాదాపు ఎనిమిది రెట్లు ఎక్కువ." అని ప్రధాని మోదీ అన్నారు.

మమతా బెనర్జీ నుంచి బంగాల్‌ను విముక్తి చేయడమే మా లక్ష్యం

అవినీతిలో కూరుకుపోయిన మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ప్రభుత్వ దుష్పరిపాలన నుంచి బంగాల్?ను విముక్తి చేయాల్సిన అవసరం ఉందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. బంగాల్ ప్రజలు ప్రస్తుతం రాష్ట్రంలో పెను మార్పు కోసం తహతహలాడుతున్నారని, నిజమైన 'పరిబోర్తన్' (మార్పు) కోసం ఆకాంక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఆదివారం కూచ్ బెహార్‌లో పార్టీ చేపట్టిన 'పరిబోర్తన్ యాత్ర' ప్రారంభించిన ఆయన, మమతా బెనర్జీ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు.

దేశ భద్రతకు ముప్పు!

ఎస్ఐఆర్ చేపట్టి ఓటర్ల జాబితాలోని అక్రమ చొరబాటుదారులను తొలగించే ప్రయత్నం ఎలక్షన్ కమిషన్ చేస్తే, దానిని మమతా బెనర్జీ అడ్డుకునే ప్రయత్నం చేశారని నితిన్ నబీన్ ఆరోపించారు. "మమతా బెనర్జీ తన పార్టీ ఓటు బ్యాంక్‌ను కాపాడుకోవడం కోసం, ఓటర్ల జాబిలోని చొరబాటుదారులకు రక్షించేందుకు సుప్రీంకోర్టుకు వెళ్లారు" అని విమర్శించారు. అయితే ఈసీ మాత్రం బంగాల్ యువత ఉద్యోగులను కొల్లగొడుతున్న సుమారు 50 లక్షల మందికిపైగా అక్రమ చొరబాటుదారుల పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించామని, రాష్ట్రంలో అక్రమ వలసదారుల కాలం చెల్లిందని అన్నారు. ఎస్?ఐఆర్? పూర్తి చేసిన తర్వాత బంగాల్ ఓటర్ జాబితా నుంచి 63.66 లక్షల పేర్లను తొలగించినట్లు ఈసీ ఇంతకు ముందే ప్రకటించిన నేపథ్యంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

"వాస్తవానికి ఓటర్ జాబితా నుంచి తొలగించబడిన వారంతా చొరబాటుదారులే. వారు అసలైన పౌరులకు చెందాల్సిన ప్రభుత్వ ఉద్యోగాలను, సంక్షేమ పథకాల ప్రయోజనాలను అక్రమంగా అనుభవిస్తున్నారు. పైగా వాళ్లు దేశభద్రతకు ముప్పుగా పరిణమించారు. మమతా బెనర్జీ అక్రమ చొరబాటుదారుల కోసం నకిలీ పత్రాలు సృష్టించి రక్షణ కల్పించారు. కానీ ఇప్పుడు మనం (బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి) కేవలం చొరబాటుదారులను రాష్ట్రం నుంచి తరిమి వేయడమే కాకుండా, బంగాల్?లోని అభివృద్ధిని పరుగులు పెట్టించే ఒక నిర్ణయాత్మక ప్రభుత్వాన్ని స్థాపించాల్సిన అవసరం ఉంది."

మమతా ఓటు బ్యాంక్ రాజకీయం

'మమతా బెనర్జీ ఓటర్ల జాబితాలోని చొరబాటుదారులను కాపాడుకోవడం కోసం కోర్టులకు పరుగులు తీశారు. ఎందుకంటే వారే ఆమె పార్టీకి ఓటు బ్యాంక్?. కానీ రాష్ట్రంలో మహిళలు అవమానాలకు గురవుతుంటే మాత్రం, ఆమె కళ్లు మూసుకున్నారు' అని నితిన్ ఆరోపించారు. చొరబాటుదారు లను ఉద్దేశించి మాట్లాడుతూ, 'బంగాల్? నుంచి మిమ్మల్ని తరిమేసే సమయం ఆసన్నమైంది' అని అన్నారు.

ఏకంగా 63.66 లక్షల ఓటర్ల తొలగింపు

బంగాల్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈసీ శనివారం అధికారిక గణాంకాలు విడుదల చేసింది. గతేడాది నవంబర్?లో ప్రారంభించిన ఎస్ఐఆర్ ద్వారా 63.66 లక్షల ఓటర్ల పేర్లను (మొత్తం ఓటర్లలో 8.3 శాతం) తొలగించామని స్పష్టం చేసింది. దీనితో రాష్ట్ర ఓటర్ల సంఖ్య 7.66 కోట్ల నుంచి 7.04 కోట్లకు చేరింది. 2002 తరువాత జరిగి ఈ భారీ ప్రక్షాళనలో మరో 60.06 లక్షల మంది ఓటర్లను అండర్ అడ్జ్యుడికేషన్ విభాగంలో ఉంచారు. వీరి అర్హతపై మరికొన్ని వారాల్లో న్యాయ విచారణ జరగనుంది. ఇది నియోజకవర్గాల స్థాయి సమీకరణాలను మరింత మార్చే అవకాశం ఉంది. 2025 డిసెంబర్? 16న ప్రచురించిన ముసాయిదా జాబితాలో మరణం, వలసలు, నకిలీ నమోదులు, ఆచూకీ లేని కారణాలతో 58 లక్షల పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించారు. కాగా తాజా విచారణ, అభ్యంతరాల స్వీకరణ తర్వాత ఫారమ్-7 ద్వారా మరో 5.46 లక్షల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తీసేశారు. అంటే మొత్తంగా 63.66 లక్షల పేర్లను అధికారికంగా తొలగించారు.

ఖమేనీ మృతితో జమ్ముకశ్మీర్‌లో ఉద్రిక్తత

శ్రీనగర్: ఇరాన్ అత్యున్నత నేత అయతొల్లా అలీ ఖమేనీ మృతితో జమ్ముకశ్మీర్‌లో ఉద్రిక్తతలు తలెత్తాయి. అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఖమేనీ ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలు వెలువడటంతో ఆదివారం కశ్మీర్ లోయతో పాటు జమ్మూలోని పలు ప్రాంతాల్లో నిరసనలు మిన్నంటాయి. షియా సామాజిక వర్గం అధికంగా ఉన్న ప్రాంతాల్లో వేలాది మంది ప్రజలు రోడ్లపైకి వచ్చి, తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందిస్తూ, ప్రజలందరూ సంయమనం పాటించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. అయతొల్లా అలీ ఖమేనీ మృతి దరిమిలా శ్రీనగర్ సహా కశ్మీర్‌లోని మెజారిటీ ప్రాంతాలు, జమ్ము శివారులోని భటిండి, రాంబన్ జిల్లాలోని చందర్‌కోట్ తదితర ప్రాంతాల్లో ఆకస్మికంగా నిరసన ప్రదర్శనలు చోటుచేసుకున్నాయని అధికారులు తెలిపారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో శాంతిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న ముఖ్యమంత్రి.. ఇరాన్‌లో ఉన్న జమ్ముకశ్మీర్ విద్యార్థులు, ఇతరుల భద్రత విషయంలో తమ ప్రభుత్వం కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో సంప్రదింపులు జరుపుతోందని భరోసా అన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే వారిపై బలప్రయోగం చేయవద్దని, పోలీసులు, పరిపాలనా యంత్రాంగం నిగ్రహంతో వ్యవహరించాలని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా 'ఎక్స్' వేదికగా కోరారు. మరోవైపు ఈ ఆకస్మిక నిరసనల నేపథ్యంలో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షిస్తున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిఘా ఉంచాలని, క్షేత్రస్థాయిలో పరిస్థితిని నిశితంగా గమనించాలని జిల్లా పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

ఫిబ్రవరిలోనే సెగలు.. రికార్డ్ బ్రేక్.!

ప్రతిఘటన, హైదరాబాద్ : తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో విద్యుత్ వినియోగం సరికొత్త రికార్డును సృష్టించింది. సంస్థ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఫిబ్రవరిలోనే అత్యంత గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైనట్లు సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వెల్లడించారు. సాధారణంగా మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో కనిపించే గరిష్ట వినియోగం, ఈసారి ముందే రావడం గమనార్హం. గత ఏడాది మార్చి 11వ తేదీన నమోదైన 5,816 మెగావాట్ల రికార్డును అధిగమిస్తూ, ఈరోజు ఏకంగా 6,057 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది. ఎండల తీవ్రత పెరగడం , వ్యవసాయ అవసరాల కోసం విద్యుత్ వినియోగం భారీగా పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని అధికారులు విశ్లేషిస్తున్నారు. ఈ స్థాయిలో డిమాండ్ పెరిగినప్పటికీ, వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు సంస్థ ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉందని సీఎండీ భరోసా ఇచ్చారు. పెరిగిన లోడ్‌ను సమర్థవంతంగా తట్టుకునేందుకు వీలుగా క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాలను భారీగా మెరుగుపరిచినట్లు ఆయన వివరించారు. ఇందులో భాగంగా ఇప్పటికే 35 కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్లను ఛార్జ్ చేయడంతో పాటు, అదనంగా 366 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. అలాగే ఓవర్‌లోడ్ సమస్య తలెత్తకుండా సుమారు 7,600 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా సరఫరాలో నాణ్యతను పెంచినట్లు పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల బలోపేతంలో భాగంగా పంపిణీ వ్యవస్థలో కీలక మార్పులు చేపట్టారు. ముఖ్యంగా ఓవర్‌లోడ్ అధికంగా ఉన్న ఎనిమిది 33 కేవీ ఫీడర్లను విభజించి లోడ్ బ్యాలెన్సింగ్ చేయడంతో పాటు, సుమారు 1,200 కిలోమీటర్ల మేర ప్రత్యామ్నాయ 33 కేవీ లైన్లను అందుబాటులోకి తెచ్చారు. దీనివల్ల ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తినా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నిరంతరాయంగా విద్యుత్ అందించే అవకాశం ఉంటుంది. వేసవి కాలం దృష్ట్యా మున్ముందు డిమాండ్ ఇంకా పెరిగినా, నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేందుకు ఎన్పీడీసీఎల్ యంత్రాంగం పూర్తి సన్నద్ధతతో ఉందని సీఎండీ స్పష్టం చేశారు.

ఇరాన్ ప్రతీకార దాడులతో భయం గుప్పిట్లో ఇజ్రాయెల్ పౌరులు!

ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరడంతో ఇజ్రాయెల్ వాణిజ్య రాజధాని టెల్ అవీవ్‌లో భయానక వాతావరణం నెలకొంది. ఇరు దేశాల మధ్య జరుగుతున్న దాడులు నివాస ప్రాంతాలను తాకడంతో సామాన్య పౌరులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. నిన్న రాత్రి అకస్మాత్తుగా మోగిన వైమానిక దాడుల సైరన్లు, పేలుళ్ల శబ్దాలతో జనం బెంబేలెత్తిపోయారు. ప్రాణభయంతో ఇళ్లలోని సేఫ్ రూమ్‌లు, అండర్ గ్రౌండ్ బంకర్ల వైపు పరుగులు తీశారు. ఆ భయానక రాత్రి గురించి ఓ స్థానికుడు వివరిస్తూ.. "సైరన్ల శబ్దాలు వినగానే వెంటనే బంకర్లలోకి వెళ్లేంత సమయం మాకు దొరికింది. భారీ శబ్దాలు, పేలుళ్లు వినిపించడంతో మేం షెల్టర్‌లోనే ఉండిపోయాం. పగలు, రాత్రి మొత్తం అక్కడే గడిపాం" అని తెలిపారు. మరోవైపు అపార్ట్‌మెంట్‌లోని సేఫ్ రూమ్‌లో తలదాచుకున్న మరో వ్యక్తి మాట్లాడుతూ.. "భారీ శబ్దాలు వినిపించాయి. ఇప్పుడు బయటకు వచ్చి చూస్తే అంతా ధ్వంసమై కనిపించింది. అద్దాలు పగిలిపోయి, శిథిలాలు రోడ్లపై పడ్డాయి. అయితే ముఖ్యమైన విషయం ఏంటంటే.. అందరూ క్షేమంగా ఉన్నారు" అని పేర్కొన్నారు. మరికొందరు తృటిలో పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. "నిన్న రాత్రి మేం ఇక్కడ లేము, వేరే చోట నిద్రపోయాం. ఉదయం వచ్చి చూసేసరికి మా ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది" అని ఓ బాధితుడు తన నివాసం శిథిలాల వద్ద నిలబడి ఆవేదన వ్యక్తం చేశారు. దాడుల కారణంగా నగరంలోని పలు భవనాలు దెబ్బతిన్నాయి. కిటికీల అద్దాలు పగిలిపోగా, ఎమర్జెన్సీ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఆస్తి నష్టం భారీగా జరిగినా, తమ ప్రాంతంలో ప్రాణనష్టం లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. భయం, ఆందోళన మధ్య బతుకుతున్న సామాన్యులు ఈ యుద్ధం త్వరగా ముగిసి శాంతి నెలకొనాలని కోరుకుంటున్నారు.

లెబనాన్‌లోని భారతీయులకు అత్యవసర హెచ్చరిక

ఇరాన్ పై ఇజ్రాయెల్-అమెరికా దాడులతో మధ్యప్రాచ్యంలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో, లెబనాన్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి భారతీయులను అప్రమత్తం చేసింది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా, భారతీయులు అనవసర ప్రయాణాలను మానుకోవాలని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ స్థానిక యంత్రాంగం జారీ చేసే భద్రతా సూచనలను కచ్చితంగా పాటించాలని ఆదివారం ఒక ప్రకటనలో సూచించింది. లెబనాన్‌లోని భారతీయులు ఎవరైనా అత్యవసర సహాయం కోసం ఎంబసీని సంప్రదించవచ్చని తెలిపింది. ఇందుకోసం 96176860128 మొబైల్ నంబర్ లేదా ఞశీఅం.ఎవఅఱబ్‌ఏఎము.స్రశీజ.ఱఅ మెయిల్ ఐడీని అందుబాటులో ఉంచింది. ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఈ నంబర్లను సంప్రదించాలని కోరింది. మరోవైపు... ఇరాన్, గల్ఫ్ ప్రాంతంలో జరుగుతున్న పరిణామాలపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అన్ని పక్షాలు సంయమనం పాటించాలని, ఉద్రిక్తతలను పెంచకుండా సమస్యలను చర్చలు, దౌత్య మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలని భారత విదేశాంగ శాఖ కోరింది. పౌరుల భద్రతకే అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవించాలని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. కేవలం లెబనాన్ మాత్రమే కాకుండా.. ఇరాన్, ఖతార్, యూఏఈ దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు కూడా అక్కడి భారతీయులకు హెచ్చరికలు జారీ చేశాయి. ఇరాన్‌లోని భారతీయులు సాధ్యమైనంత వరకు ఇళ్లలోనే ఉండాలని, అనవసరంగా బయట తిరగవద్దని టెహ్రాన్‌లోని ఎంబసీ సూచించింది. ఖతార్, యూఏఈలలో కూడా భారతీయులు స్థానిక అధికారుల హెచ్చరికలు గమనిస్తూ, సైనిక స్థావరాలకు దూరంగా ఉండాలని ఆయా ఎంబసీలు స్పష్టం చేశాయి. ఆయా ప్రాంతాల్లోని మిషన్లు భారతీయులతో నిరంతరం టచ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు.

పాక్ డ్రోన్ కలకలం.. భారత సైన్యం కాల్పులు

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లోని సరిహద్దు నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) వెంబడి పాకిస్తాన్ మరోమారు తన కవ్వింపు చర్యలను ప్రదర్శించింది. ఆదివారం పూంచ్ జిల్లాలోని దిగ్వార్ సెక్టార్‌లో పాకిస్తాన్‌కు చెందిన ఒక అనుమానాస్పద డ్రోన్ భారత గగనతలంలోకి చొరబడటంతో అప్రమత్తమైన భారత భద్రతా దళాలు గాల్లోకి కాల్పులు జరిపాయి. సరిహద్దుల్లోని ఫార్వర్డ్ పోస్ట్‌ల వద్ద పహారా కాస్తున్న సైనికులు ఆకాశంలో డ్రోన్ అసాధారణ కదలికలను గుర్తించారు. అది పాక్ భూభాగం నుంచి వస్తున్న డ్రోన్‌గా నిర్ధారించుకున్న వెంటనే సైన్యం దాన్ని కూల్చివేసేందుకు పన్నెండు రౌండ్లకు పైగా కాల్పులు జరిపింది. భారత బలగాల కాల్పుల ధాటికి తాళలేక ఆ డ్రోన్ వెంటనే తిరిగి పాక్ ఆక్రమిత కశ్మీర్ (గ్రాశీఖ) వైపు వెళ్లిపోయింది. ఈ ఘటనలో ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. గత మూడు రోజుల వ్యవధిలోనే ఈ ప్రాంతంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం ఇది రెండోసారి కావడం గమనార్హం. ఫిబ్రవరి 27న కూడా పూంచ్ సెక్టార్‌లోనే సరిహద్దు రేఖ వెంబడి ఒక డ్రోన్ కనిపించగా, అప్పుడు కూడా భారత సైన్యం కాల్పులు జరిపి దాన్ని తరిమికొట్టింది. వరుసగా డ్రోన్లు చొరబడుతుండటంతో సరిహద్దు భద్రతా దళాలు అత్యున్నత స్థాయి అప్రమత్తతను ప్రకటించాయి. ఈ డ్రోన్ చొరబాటు వెనుక భారత భూభాగంలోకి ఆయుధాలు, పేలుడు పదార్థాలు లేదా మాదకద్రవ్యాలను చేరవేసే కుట్ర ఉండవచ్చని భద్రతా సంస్థలు అనుమానిస్తున్నాయి. కాగా తాజా ఘటనలో డ్రోన్ ద్వారా ఏవైనా అనుమానాస్పద వస్తువులను జారవిడిచారా అనే కోణంలో అణువణువూ గాలిస్తున్నారు. అంతర్జాతీయంగా ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, సరిహద్దుల వెంబడి భారత్ తన నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేసింది.

నాగ్‌పుర్‌లో భారీ పేలుడు.. 15 మంది మృతి

నాగ్‌పూర్: మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో భారీ పేలుడు సంభవించింది. కటోల్‌లోని పేలుడు పదార్థాల తయారీ పరిశ్రమ ఎస్‌బీఎల్ కంపెనీ లో ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ఈ ఘటనలో 15 మంది మృతిచెం దగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను నాగ్‌పూర్‌లోని ఆరెంజ్ సిటీ ఆసుపత్రికి తరలించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీయడానికి సహాయక చర్యలు జరుగుతున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాముందని అధికారులు భావిస్తున్నారు. ఈ పరిశ్రమలో డిటోనేటర్లతో పాటు భూకంప పేలుడు పదార్థాలు తయారు చేస్తారని స్థానికులు తెలిపారు. పేలుడు సంభవించిన సమయంలో, 30 మందికి పైగా పరిశ్రమలో పని చేస్తున్నారని తెలిపారు. ఈ పేలుడు ధాటికి చుట్టుపక్కల ప్రాంతాల్లో

తెలుగు ప్రజల కోసం రంగంలోకి రేవంత్..

-మొదటిపేజీ తరువాయి

కార్యాలయాలు జారీ చేసే సూచనలు.. హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గల్ఫ్ దేశాల్లో ఉన్న తెలంగాణ వాసుల పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పరిశీలిస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఒకవేళ అత్యవసర పరిస్థితులు ఎదురైతే.. తెలుగు ప్రజలను సురక్షితంగా వెనక్కి రప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుంటున్నామని.. అవసరమైన చర్యలు తీసుకునేందుకు అధికారులను ఇప్పటికే అప్రమత్తం చేశామని తెలిపారు. విదేశాల్లో ఉన్న భారత ఎంబసీలు.. కాన్సులేట్లతో సంప్రదింపులు జరపాలని అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ ప్రజల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. యుద్ధం జరుగుతున్న ప్రాంతాల్లో చిక్కుకుపోయిన వారు ఆందోళన చెందకుండా.. స్థానిక నిబంధనలను గౌరవిస్తూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తితే తక్షణమే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రతి ఒక్కరూ క్షేమంగా ఉండాలని.. యుద్ధ మేఘాలు తొలగి శాంతి నెలకొనాలని ఆయన ఆకాంక్షించారు. గల్ఫ్ దేశాల్లో ఉన్న వేలాది మంది తెలంగాణ కార్మికుల కుటుంబాలు ఈ వార్తలతో ఆందోళన చెందుతున్న తరుణంలో.. ముఖ్యమంత్రి ఇచ్చిన భరోసా వారికి కొంత ఊరటనిస్తోంది. ప్రస్తుతం గగనతలం మూసివేయడం.. విమాన సర్వీసులు రద్దు కావడంతో ప్రయాణాలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం జరిపే దౌత్యపరమైన చర్చల్లో తెలంగాణ ప్రభుత్వం చురుగ్గా పాల్గొంటుందని రేవంత్ రెడ్డి వివరించారు. అక్కడ ఉన్న తెలుగు సంఘాలతో కూడా సమన్వయం చేసుకుంటూ.. అవసరమైన సహాయక చర్యలు అందించేందుకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోంది.

మావోయిస్టు సాంబయ్య మరో 14 మందితో కలిసి సరెండర్

-మొదటిపేజీ తరువాయి

సభ్యులు, ఏరియా కమిటీ సభ్యులు కూడా లొంగిపోయారు. వారి వెంట తీసుకెళ్లిన ఆయుధాలను సైతం పోలీసులకు అప్పగించారు. స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా ఉన్న ముప్పిడి సాంబయ్య గురించి తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి సైతం ఇటీవల ప్రస్తావించి జన జీవన స్రవంతిలోకి రావాల్సిందిగా పిలుపునిచ్చారు. రోజుల వ్యవధిలోనే ఆయన లొంగిపోవడం గమనార్హం.

సరెండర్‌లో జర్నలిస్టు మీడియేషన్ :

ఆపరేషన్ కగార్ లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టు ఉద్యమాన్ని, ఆ పార్టీలోని కీలక నేతలను నిర్మూలించే కార్యక్రమాన్ని చేపట్టడంతో ముప్పిడి సాంబయ్య లొంగుబాటులో స్టేట్ ఇంటెలిజెన్స్ సహకారంతో ఒక జర్నలిస్టు యాక్టివ్ రోల్ పోషించినట్లు అక్కడి మీడియాలో వార్తలు వచ్చాయి. సాంబయ్యతో పాటు డివిజనల్ కమిటీ సభ్యుడు మంగేశ్ (బేబీ), ఏరియా కమిటీ సభ్యులు రింకూ, అస్మిత, హోలిక, రీటా, నీలా, ప్లాటూన్ సభ్యులు దినేష్, కవిత, సవిత, జుగ్నూ, సుశ్మిత, అమిత, మీనా తదితరులు కూడా ఉన్నట్లు చత్తీస్‌గఢ్ పోలీసు వర్గాలు వెల్లడించాయి. లొంగిపోయినవారితో పాటు మూడు ఏకే-47 రైఫిళ్లు, రెండు ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, మరో రెండు ఇన్సాస్ రైఫిళ్లు, మూడు 0.303 రైఫిళ్లు, పలు రకాల మందుగుండు సామగ్రిని కూడా అప్పగించినట్లు తెలిపాయి.

ఐదున్నర దశాబ్దాల తర్వాత సొంతూరికి మల్లోజుల

-మొదటిపేజీ తరువాయి

ఆయన రాకతో పెద్దపల్లిలో చర్చనీయాంశంగా మారింది. మల్లోజుల వచ్చాడని తెలిసి చాలా మంది బంధువులు, స్నేహితులు, స్థానికులు ఆయనను చూసేందుకు వచ్చారు. మావోయిస్టు పార్టీని వీడి బయటికి వచ్చిన దృష్ట్యా మహారాష్ట్ర నుంచి ఒక ఎస్పీ స్థాయి అధికారితోపాటు 9 మంది పోలీసులు భద్రత కల్పించారు. స్థానిక పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. వేణుగోపాల్ రావు తల్లి మధురమ్మ 2022లో చనిపోగా, తండ్రి వెంకటయ్య 1997లోనే చనిపోయారు. వారికి ముగ్గురు కొడుకుల్లో వేణుగోపాల్ రావు చిన్నవాడు. వీరి రెండో కుమారుడు మల్లోజుల కోటేశ్వర్ రావు అలియాస్ కిషన్ జీ మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా పని చేస్తూ 2011లో పశ్చిమ బెంగాల్ లో జరిగిన ఎన్ కౌంటర్ లో చనిపోయారు. మల్లోజుల వేణుగోపాల్ మావోయిస్టు ఉద్యమంలో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో సుదీర్ఘకాలం పాటు కార్యకలాపాలు నిర్వహించి పోలీసులకు సవాల్‌గా నిలిచారు. పలు ఎన్‌కౌంటర్లు, ఆపరేషన్లలో ఆయన పేరు ప్రస్తావనకు వచ్చేది. కేంద్ర కమిటీ కార్యదర్శి బసవరాజు మరణం తర్వాత మల్లోజుల వేణుగోపాల్ రావు లొంగుబాటు మావోయిస్టు పార్టీని బలహీనపరిచింది. కాగా, మల్లోజుల సోదరుడు అంజయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడన్న విషయం తెలుసుకున్న వేణుగోపాల్ ఆయనను పరామర్శించడానికి పెద్దపల్లికి వచ్చారు. మల్లోజుల వేణుగోపాల్ రావు వచ్చిన విషయం తెలుసుకున్న బంధుమిత్రులు, గ్రామస్తులు ఆయన ఇంటికి భారీగా తరలివచ్చారు. మల్లోజులతో మాట్లాడారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆయనతో కలిసి సెల్ఫీలు దిగారు. మొత్తానికి మల్లోజుల సొంతూరుకు రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

నల్లగొండ నుంచి ఫ్లోరైడ్‌ను పూర్తిగా నిర్మూలిస్తాం

-మొదటిపేజీ తరువాయి

ఆయన గుర్తుచేశారు. అయితే, ముఖ్యమంత్రి , ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో మళ్లీ పనులను వేగవంతం చేశామని, ఇప్పటికే 18 మీటర్ల పని పూర్తయిందని తెలిపారు. 2028 జూన్ నాటికి ఈ స్వరంగ మార్గాన్ని పూర్తి చేసి, జిల్లా నుంచి ఫ్లోరైడ్‌ను శాశ్వతంగా పారద్రోలుతామని ఆయన భరోసా ఇచ్చారు. 17 ఏళ్ల క్రితం ప్రారంభమైన బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టును గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని మంత్రి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఈ ప్రాజెక్టును పూర్తి చేసి చెరువులను నింపుతున్నామని చెప్పారు. రాబోయే మూడు నెలల్లో మరో రూ. 200 కోట్లు ఖర్చు చేసి, లైనింగ్ పనులు పూర్తి చేస్తామని, తద్వారా ప్రతి ఎకరానికి సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. సాగునీటితో పాటు రవాణా వ్యవస్థను కూడా మెరుగుపరుస్తున్నామని మంత్రి తెలిపారు. నల్లగొండ నుంచి మునుగోడుకు వెళ్లే రహదారిని డబుల్ రోడ్డుగా మారుస్తామని, జిల్లాలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, ఇచ్చిన మాట ప్రకారం అన్ని ప్రాజెక్టులను గడువులోగా పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఇరాన్ టాప్-లీడర్‌షిప్ ఖతం.. ఖమేనీ సహా 40 మంది కమాండర్లు హతం..

-మొదటిపేజీ తరువాయి

సుప్రీం లీడర్ ఖమేనీ మరణించారు. మొత్తం 40 మంది టాప్ కమాండర్లు హతమైనట్లు ఇజ్రాయిల్ చెబుతోంది. ఇజ్రాయిల్ వైమానిక దాడుల్లో మరణించిన వారిలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ, అతని కుటుంబ సభ్యులతో పాటు రక్షణ మంత్రి అమీర్ నాసిర్జాదే, ఇరాన్ సాయుధ దళాల చీఫ్ ఆఫ్ స్టాఫ్ మేజర్ జనరల్ అబ్దుల్‌రహీం మౌసావి, ×=+జ కమాండర్-ఇన్-చీఫ్ మొహమ్మద్ పక్‌పూర్, సీనియర్ భద్రతా సలహాదారు అలీ షాంఖానీ, మిలిటరీ ఇంటెలిజెన్స్ చీఫ్ సలాహ్ అస్సాది మరియు సుప్రీం లీడర్ మిలిటరీ బ్యూరో చీఫ్ మొహమ్మద్ షిరాజీ ఉన్నారు. ఇరాన్ పోలీస్ ఇంటెలిజెన్స్ సెంటర్ అధిపతి బ్రిగేడియర్ జనరల్ ఘోలం రెజా రెజాయన్ కూడా మరణించారు.

ఒక్క కొత్త ఇల్లు కట్టినట్లు నిరూపించినా..

రాజకీయ సన్యాసం తీసుకుంటా..

ప్రతిఘటన, హైదరాబాద్

హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు ఒక్కటంటే ఒక్క కొత్త ఇల్లు కట్టినట్లు నిరూపించినా తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సవాల్ విసిరారు. మూసీ ప్రాజెక్టు బాధితులకు అండగా నిలిచేందుకు మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి ఇతర నేతలతో కలిసి ఆయన 'మూసీ దండియాత్ర' నిర్వహించారు. కేకే నగర్ ఫేజ్-2 నుండి మధుపార్క్ రిడ్జ్ వరకు సాగిన ఈ పాదయాత్రలో బాధితులను పరామర్శించిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుతం నడుస్తోంది ప్రజాపాలన కాదని.. ఇది పక్కాగా 'బుల్డోజర్ పాలన' అని ఆయన ఎద్దేవా చేశారు.మూసీ ప్రక్షాళన పేరుతో వేల కుటుంబాలను రోడ్డున పడేస్తున్న తీరుపై కేటీఆర్ మండిపడ్డారు. "అభివృద్ధికి మేం వ్యతిరేకం కాదు.. కానీ రేవంత్ రెడ్డి గారు చేయాల్సింది పేదల ఇళ్లు కూల్చడం కాదు.. ఇందిరమ్మ ఇళ్లు కట్టివ్వడం" అని ఆయన హితవు పలికారు. అనుమతులు ఉన్న ఇళ్లను కనీసం డీపీఆర్ కూడా చూపించకుండా ఏ ప్రాతిపదికన కూలగొడతారని అధికారులను నిలదీశారు. ఒక్క పేదవాడి ఇల్లును ముట్టుకున్నా తాము స్వయంగా వచ్చి బుల్డోజర్లకు అడ్డుపడతామని హెచ్చరించారు. ముఖ్యమంత్రికి రెండు మూడు ఇళ్లు ఉండొచ్చు కానీ.. నిరుపేదలకు ఉన్న ఒక్క గూడును పడగొట్టడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధిని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 3,866 కోట్లతో ఎస్టీపీలు నిర్మించడమే కాకుండా.. ఒక్క ఇల్లు కూడా పడగొట్టకుండా ఉప్పల్ ప్రాంతంలో 5 కిలోమీటర్ల మేర మూసీ సుందరీకరణ చేసినట్లు వివరించారు. కేవలం రూ. 16 వేల కోట్లతో పూర్తయ్యే పనికి లక్షన్నర కోట్లు ఎందుకు కేటాయిస్తున్నారని.. ఈ నిధులు కమీషన్ల కోసమేనని ఆరోపించారు. కమీషన్లకు ఎగబడి ప్రభుత్వం తన విలువను పోగొట్టుకుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం అని ప్రజలకు అర్థమైంది కాబట్టే.. అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ ప్రజలు ఆ పార్టీకి ఒక్క సీటు కూడా ఇవ్వలేదని ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నిర్ణయాల వల్ల 'పైశాచిక ఆనందం' పొందుతున్నారని కేటీఆర్ ఘాటుగా విమర్శించారు. మూసీ పొడవునా ఉన్న 55 కిలోమీటర్ల మేర లక్షా యాభై వేల కుటుంబాలకు అన్యాయం జరుగుతోందని.. బాధితుల పక్షాన బీఆర్ఎస్ ఎంతవరకైనా కొట్లాడుతుందని భరోసా ఇచ్చారు. నగరంలో కొత్తగా ఒక్క రోడ్డు వేయలేదని, ఒక్క ఫ్లైఓవర్ కట్టలేదని.. కేవలం ఉన్నవాటిని కూల్చడమే ధ్యేయంగా ఈ ప్రభుత్వం పనిచేస్తోందని దుయ్యబట్టారు.

చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌పై పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ ఫిర్యాదు

శ్రీవారి లడ్డూ ప్రసాదం పవిత్రతను దెబ్బతీసేలా అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్నారంటూ విజయవాడకు చెందిన దేవరకొండ నాగవర ప్రసాద్ పుల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనను తాను ఏకలవ్య సంతానానికి చెందిన ఎరుకల కులస్తుడిగా పరిచయం చేసుకున్న ఆయన.. తమ జాతి మూల పురుషుడు ఏకలవ్యుడని పేర్కొన్నారు. తమ కులదేవత అయిన ఎరుకల నాంచారమ్మ ఇరుకు చెప్పడం వల్లే శ్రీనివాసుడి కల్యాణం జరిగిందనే ప్రసిద్ధి ఉందని గుర్తు చేశారు. వెంకటేశ్వర స్వామిని ప్రాణదైవంగా పూజించే తమ సామాజిక వర్గానికి లడ్డూ ప్రసాదంపై జరుగుతున్న దుష్ప్రచారం తీవ్ర మనస్తాపం కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కోట్లాది మంది భక్తుల విశ్వాసాలను గాయపరిచేలా జిగుప్సాకరమైన పదజాలాన్ని ఉపయోగించడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ ఫిర్యాదులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. మంత్రి నారా లోకేష్.. టీటీడీ ఈఓ శ్యామలరావు.. చైర్మన్ బీఆర్ నాయుడు పేర్లను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. వీరితో పాటు ఈటీవీ అధినేత చెరుకూరి కిరణ్.. ఏబీఎన్ రాధాకృష్ణ.. మహా ఛానల్ వంశీకృష్ణ వంటి మీడియా ప్రముఖులపై కూడా ఫిర్యాదు చేశారు. లడ్డూ ప్రసాదానికి వ్యతిరేకంగా చర్చలు పెట్టి భక్తులు వినడానికే అసహ్యం కలిగేలా మాట్లాడిన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏ తేదీల్లో ఎవరెవరు ఏ విధంగా మాట్లాడారో పూర్తి వివరాలతో కూడిన నివేదికను పోలీసులకు అందజేశారు. పోలీసులు ఫిర్యాదును స్వీకరించినప్పటికీ.. రశీదు ఇవ్వడానికి నిరాకరించారని.. దీనిపై తదుపరి న్యాయ పోరాటం చేస్తానని ప్రసాద్ వెల్లడించారు. ప్రస్తుతం తాను మెడికల్ లీవ్‌లో ఉన్నట్లు తెలిపిన ప్రసాద్.. గతంలో శ్రీకాకుళం డీటీసీలో విధులు నిర్వహించినట్లు చెప్పారు. అక్కడి నుండి అనంతపురం పీటీసీకి బదిలీ చేసినా.. అనారోగ్య కారణాల వల్ల సెలవును పొడిగించుకుంటున్నట్లు వివరించారు. తాను స్వచ్ఛంద పదవీ విరమణ కోరుతూ దరఖాస్తు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం నుండి సరైన స్పందన రావడం లేదని ఆరోపించారు. మార్చి 31 లోపు తన రాజీనామాను ఆమోదించాలని కోరినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే లడ్డూ వివాదంపై సీఎం వ్యాఖ్యలు చేయడం వల్ల మనస్తాపానికి గురై ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో చట్టపరంగా ముందుకు వెళ్లి బాధ్యులకు శిక్ష పడేలా చూస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

కవితకు కేసీఆర్ మరో ఛాన్స్?

-మొదటిపేజీ తరువాయి

కొన్ని పొలిటికల్ రీజన్స్ వలన కవిత తన తండ్రికి దూరమయ్యారు. తాజాగా మరోసారి దగ్గర అయ్యేందుకు ఆమె ప్రయత్నాలు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. మరోవైపు కేసీఆర్ సైతం కూతురికి మరో చాన్స్ ఇద్దామా? అని ఆలోచన చేస్తున్నట్టు టాక్ వినిపిస్తోంది.

పార్టీకి డ్యామేజ్ జరుగుతోందని..

లిక్కర్ స్కామ్‌లో ఆమెకు క్లీన్ చిట్ రాకముందు నుంచే కవిత బీఆర్ఎస్ పార్టీని టార్గెట్ చేశారు. కేటీఆర్, హరీశ్ రావు,సంతోష్ రావు మీద తీవ్ర విమర్శలు గుప్పించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో వారిదే కీలకపాత్ర అని ఆరోపించారు. సిట్ దర్యాప్తునకు పిలిస్తే హాజరై తన వద్దనున్న ఆధారాలు సమర్పిస్తానని ప్రకటించారు.తన భర్త, తన ఫోన్‌ను గత బీఆర్ఎస్ సర్కార్ ట్యాపింగ్ చేయించిందని సైతం ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై ఆమె బహిరంగ విమర్శలు గుప్పించారు. రీసెంట్‌గా లిక్కర్ స్కామ్ కేసులో కవిత నిర్దోశి అని తేలాక..కేటీఆర్ చేసిన ట్వీట్ మరోసారి అన్నాచెల్లెళ్ల మధ్య వివాదానికి దారితీసింది. 'లిక్కర్ స్కామ్ వల్లే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయింది.. నిర్దోశిగా బయటపడిన కవితకు శుభాకాంక్షలు' అంటూ ఆయన చేసిన పోస్టు వారి మధ్య మరింత గ్యాప్ పెంచింది.

కౌంటర్ ఎటాక్..

బీఆర్ఎస్ ఓటమికి లిక్కర్ స్కామ్ కారణమని కేటీఆర్ కామెంట్ చేయడం పట్ల కవిత తీవ్రంగా స్పందించారు. బీఆర్ఎస్ ఓటమిని తన మెడకు తగిలించవద్దని అన్నారు. ఉద్యమద్రోహులు, అవినీతిపరులకు టికెట్లు ఇవ్వడం, ప్రజావ్యతిరేకతే బీఆర్ఎస్ ఓటమికి కారణమని సోదరుడికి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తనతో బీఆర్ఎస్ నేతలు టచ్ లో ఉన్నారని.. మే నెలలో పెట్టబోయే కొత్త పార్టీ ద్వారా అసలైన ఉద్యమకారులను గుర్తిస్తామని, వారికి న్యాయం చేస్తామని ప్రకటించారు. తన రాజకీయ శత్రువులకు త్వరలోనే గట్టి సమాధానం ఇస్తామని అన్నారు. కాగా, కవిత బీఆర్ఎస్ పార్టీని టార్గెట్ చేయడంపై గులాబీ బాస్ అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తున్నది. దీనికి తోడు లిక్కర్ స్కామ్ లో ఆమెకు క్లీన్ చిట్ రావడంతో ఫ్యామిలీ వివాదాలకు చెక్ పెట్టాలని కేసీఆర్ చూస్తున్నట్టు సమాచారం.

కవిత వెనక్కి వెళ్తారా?

కేసీఆర్ నేరుగా కవితను పిలువకపోయినా మధ్యవర్తుల ద్వారా తిరిగి పార్టీలోకి రావాలని పిలిస్తే కవిత వెళ్తారా? అనేది మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది.కవిత ఒకవేళ పార్టీలోకి వెళ్లినా ఆమె ఎలాంటి పొజిషన్ ఆశించనున్నారు? హరీశ్ రావు, సంతోష్ రావుల విషయంలోనూ ఎటువంటి డిమాండ్లు కేసీఆర్ ముందు పెట్టనున్నారు? వారితో కలిసి మళ్లీ సాధారణంగా పనిచేయగలరా? అని అనేక ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. అదే జరిగితే బీఆర్ఎస్ పార్టీకి రాజకీయంగా కొంత ప్లస్ అవ్వొచ్చని విశ్లేషకులు అంటున్నారు.ఎందుకంటే కవిత ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ టార్గెట్‌గా విమర్శలు చేస్తుండగా..ఇతర పార్టీలకు పరోక్షంగా ప్లస్ అవుతున్న వాదనలు వినిపిస్తున్నాయి.

15 రోజులే గడువు.. లేదంటే అసెంబ్లీలో వీడియోలు రిలీజ్ చేస్తా..

కరీంనగర్ సీపీకి కౌశిక్ రెడ్డి అల్టిమేటం

ప్రతిఘటన, హైదరాబాద్ : హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంపై విరుచుకుపడ్డారు. సీపీ తన అధికార పరిధిని దాటి వ్యవహరిస్తున్నారని.. ప్రభుత్వ ఆస్తులను వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు. సీపీ చేస్తున్న అక్రమాలకు సంబంధించిన వీడియోలు తన వద్ద ఉన్నాయని.. త్వరలోనే వాటిని అసెంబ్లీ వేదికగా బహిర్గతం చేస్తానని సంచలన వ్యాఖ్యలు చేశారు. 15 రోజుల్లోగా ప్రభుత్వం స్పందించి సీపీపై చర్యలు తీసుకోకపోతే ఆధారాలన్నీ ప్రజల ముందు ఉంచుతానని అల్టిమేటం జారీ చేశారు.ప్రభుత్వ వాహనాల దుర్వినియోగంపై కౌశిక్ రెడ్డి నంబర్లతో సహా వివరాలను బయటపెట్టారు. కరీంనగర్ సీపీకి కేటాయించిన ఇన్నోవా వాహనం (టీఎస్ 09 పీఏ 4195) హైదరాబాద్ ప్రాంతంలో తిరుగుతోందని.. దీనిని ఐఆర్ఎస్ అధికారి వికాస్ అగర్వాల్ తండ్రి కోసం ఉపయోగిస్తున్నారని దుయ్యబట్టారు. అలాగే మరో ప్రభుత్వ వాహనాన్ని (టీఎస్ 09 పీఏ 5601) గౌస్ ఆలం తన సోదరుడి వ్యక్తిగత పనుల కోసం వాడుతున్నారని విమర్శించారు. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ప్రభుత్వ నిధులను.. వనరులను ఇష్టారాజ్యంగా ఖర్చు చేయడం అధికార దుర్వినియోగమేనని ఆయన మండిపడ్డారు. పోలీస్ కమిషనర్ తన కుటుంబ సభ్యుల కోసం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని కౌశిక్ రెడ్డి ఆరోపించారు. తన సతీమణికి కరీంనగర్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఇప్పించడమే కాకుండా.. ఆమె భద్రత కోసం ఇద్దరు కానిస్టేబుళ్లను నియమించారని తెలిపారు. సీపీ ఇంట్లోనే సుమారు 20 మంది కానిస్టేబుళ్లు పని చేస్తున్నారని.. శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులను ఇంటి పనులకు వాడుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఇలాంటి ఘటనల వల్ల ఐపీఎస్ అధికారుల అసోసియేషన్ పరువు మంటగలిసే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే ఈ వ్యవహారమంతా అసెంబ్లీ సాక్షిగా బయటపడుతుందని కౌశిక్ రెడ్డి హెచ్చరించారు. గౌస్ ఆలం వ్యవహరిస్తున్న తీరుపై ఉన్నతాధికారులు.. ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. పోలీసు వ్యవస్థలో జరుగుతున్న ఇటువంటి అక్రమాలను సహించేది లేదని.. బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

సంపాదకీయం

ప్రపంచాన్ని కుదిపేస్తున్న

ఎప్ స్టీన్ ఫైల్స్

జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్‌తో ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారులు, రాజకీయ నాయకులు, దేశాల అధ్యక్షులు, కంపెనీల అధినేతలు వణికిపోతున్నారు. ఎప్‌స్టీన్ కేసు మళ్లీ ప్రపంచాన్ని కుదిపేస్తోంది. గతంలోనే అంతర్జాతీయంగా పెద్ద చర్చకు దారితీసిన ఈ వ్యవహారం.. ఇప్పుడు కొత్తగా వెలుగులోకి వస్తున్న ఫైల్స్‌తో మరోసారి ప్రభావం చూపుతోంది. ప్రముఖ వ్యాపార, విద్యా, రాజకీయ రంగాలకు చెందిన వ్యక్తుల పేర్లు బయటకు రావడం, ఆ తర్వాత రాజీనామాల పరంపర మొదలవడం.. ఇది సాధారణ పరిణామం కాదు. ప్రపంచ స్థాయి సంస్థల విశ్వసనీయత, నైతిక ప్రమాణాలపై గంభీరమైన ప్రశ్నలను లేవనెత్తే పరిణామంగా ఇది మారింది. ఈ సందర్భంలో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూ ఈ ఎఫ్) సీఈవో బోర్జ్ బ్రెండే రాజీనామా అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రపంచ ఆర్థిక విధానాలను ప్రభావితం చేసే ప్రముఖ వేదికకు నాయకత్వం వహిస్తున్న వ్యక్తి.. ఇలాంటి ఆరోపణల నడుమ తప్పుకోవడం సంస్థపై నేరుగా ప్రభావం చూపే అంశం. అమెరికా న్యాయ శాఖ విడుదల చేసిన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో బ్రెండే పేరు ప్రస్తావించబడడం.. ఆయన ఎప్‌స్టీన్‌తో భేటీ అయినట్లు ఆధారాలు బయటపడడం ఈ పరిణామానికి కారణమయ్యాయి. దర్యాప్తు కొనసాగుతున్న సమయంలోనే ఆయన రాజీనామా చేయడం.. నైతిక బాధ్యతగా భావించవచ్చు. అయితే తన రాజీనామా లేఖలో ఈ అంశాన్ని నేరుగా ప్రస్తావించకపోవడం సందేహాలకు తావిస్తోంది. ఇది కేవలం ఒక వ్యక్తి రాజీనామా కథ కాదు. హార్వర్డ్ మాజీ అధ్యక్షుడు లారెన్స్ సమ్మర్స్, నోబెల్ గ్రహీత రిచర్డ్ ఆక్సెల్, గోల్డ్‌మన్ శాక్స్ లీగల్ ఆఫీసర్ క్యాథీ రూమ్లెర్, హయత్ హోటల్స్ వారసుడు థామస్ ప్రిట్‌జ్కర్, డీపీ వరల్డ్ చైర్మన్ సుల్తాన్ అహ్మద్ , నార్వే అంబాసిడర్ మోనా వంటి ప్రముఖులు కూడా ఈ వివాదంతో తమ పదవులను వదులుకోవడం.. ఈ వ్యవహారం ఎంత విస్తృతంగా ఉందో తెలియజేస్తోంది. వ్యాపార దిగ్గజాలు, విద్యావేత్తలు, ప్రభుత్వ అధికారుల వరకు విస్తరించిన ఈ సంబంధాల నెట్‌వర్క్, అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనకు కారణమవుతోంద ఈ పరిణామాల వల్ల ప్రధానంగా మూడు అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. మొదటిది ప్రపంచ ఎలైట్ వర్గాల మధ్య ఉన్న సంబంధాల స్వభావం. రెండవది నైతిక బాధ్యత అనే అంశం. మూడవది సంస్థల పారదర్శకతపై ఉన్న నమ్మకం. ఎవరైనా చట్టపరంగా తప్పు చేశారనే విషయం నిరూపించబడకపోయినా.. ప్రజా విశ్వాసాన్ని కాపాడుకోవడానికి నాయకులు రాజీనామా చేయాల్సిన పరిస్థితి రావడం.. నేటి ప్రపంచంలో నైతిక ప్రమాణాలు ఎంత కీలకమో చూపిస్తోంది. ప్రత్యేకంగా వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వంటి సంస్థల విషయంలో ఈ అంశం మరింత ప్రాముఖ్యం సంతరించుకుంటుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే నిర్ణయాలు తీసుకునే వేదికగా ఉన్న ఈ సంస్థపై ప్రజలకు నమ్మకం ఉండాలి. అందుకే ఏ చిన్న వివాదం కూడా పెద్ద ప్రభావం చూపే అవకాశం ఉంది. బ్రెండే స్థానంలో తాత్కాలికంగా అలోయిస్ జ్వింగీ బాధ్యతలు చేపట్టడం, సంస్థ కొనసాగింపుకు అవసరమైన చర్యగా కనిపిస్తున్నా, దీర్ఘకాలికంగా సంస్థ ప్రతిష్టను పునరుద్ధరించడం పెద్ద సవాలుగా మారింది. అదే సమయంలో ఈ ఫైల్స్ విడుదలలో పారదర్శకత ఎంత వరకు ఉందనే ప్రశ్న కూడా లేవనెత్తబడుతోంది. దర్యాప్తు వివరాలు పూర్తిగా బయటకు రాకపోవడం.. సమాచారం గోప్యంగా ఉంచడం ఇవి మరోవైపు అనుమానాలను పెంచే అంశాలు. ప్రజలకు పూర్తి నిజాలు తెలియజేయకపోతే, ఊహాగానాలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. మొత్తం మీద ఎప్‌స్టీన్ ఫైల్స్ వ్యవహారం ఒక వ్యక్తి లేదా కొన్ని రాజీనామాలకే పరిమితం కాదు. ఇది ప్రపంచ ఎలైట్ వ్యవస్థలో ఉన్న బలహీనతలను బహిర్గతం చేస్తున్న సంఘటనగా చూడాలి. సంస్థల విశ్వసనీయత, నాయకుల నైతిక బాధ్యత, పారదర్శకత ఈ మూడు అంశాలు భవిష్యత్తులో మరింత కఠినంగా పరీక్షించబడే అవకాశం ఉంది. ఈ పరిణామాలు గ్లోబల్ స్థాయిలో పరిపాలనా విధానాలపై, నాయకత్వ ప్రమాణాలపై కొత్త చర్చలకు దారి తీస్తున్నాయి.ఎప్పుడు ఎవరి బాగోతం బయట పడుతుందో అర్థం కాని పరిస్థితి. ఇప్పటికే మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ ఇప్పటికే తప్పు అంగీకరించాడు. ఇక డొనాల్డ్ ట్రంప్ కూడా ఇందులో ఉన్నాడు. అయితే తాజాగా బయటపడిన ఈ ఫైల్స్ కారణంగా పలు కంపెనీల దిగ్గజాలు కూడా ఉన్నారు. వీరు రాజీనామా బాట పడుతున్నారు. తాజాగా వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సీఈవో బోర్జ్ బ్రెండే తన పదవికి రాజీనామా చేశారు, దవోస్ సమ్మిట్‌ల సంస్థకు ఇది భారీ దెబ్బ. హార్వర్డ్ యూనివర్సిటీ మాజీ అధ్యక్షుడు లారెన్స్ సమ్మర్స్, నోబెల్ బహుమతి విజేత రిచర్డ్ ఆక్సెల్ కూడా బాధ్యతల నుంచి వైదొలిగారు. ఈ ముగ్గురూ ఎప్‌స్టీన్ ఈవెంట్స్‌లో పాల్గొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.వాల్ స్ట్రీట్ జెయింట్ గోల్డ్‌మన్ సాక్స్‌లో చట్టపరమైన విభాగం హెడ్ క్యాథీ రూమ్లెర్, హయాత్ హోటల్స్ వారసుడు థామస్ ప్రిట్‌జ్కర్ తమ స్థానాలు వదులుకున్నారు. గ్లోబల్ పోర్ట్ ఆపరేటర్ డీపీ వరల్డ్ చైర్మన్ సుల్తాన్ అహ్మద్ బిన్ సులాయెం, నార్వే అంబాసిడర్ మోనా జుహానీ కూడా రాజీనామా చేశారు. ఈ లిస్ట్ రోజుకొకకొనసాగుతోంది, ఫైనాన్షియల్ మార్కెట్లలో అనిశ్చితి పెరుగుతోంది.ఎప్‌స్టీన్ డాక్యుమెంట్స్‌లో 170+ ప్రముఖుల పేర్లు వచ్చాయి. ఇందులో పాలిటీషియన్లు, బిజినెస్ టైకూన్లు, సైంటిస్టులు ఉన్నారు. ఈ ఆరోపణలు సెక్సువల్ ట్రాఫికింగ్, ఇన్‌ఫ్లుయెన్స్ పెడ్లింగ్‌కు సంబంధించినవి. ఫైనల్ కోర్ట్ ఆర్డర్‌తో ఈ ఫైల్స్ పబ్లిక్ డొమైన్‌లోకి వచ్చాయి, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఈ రాజీనామాలు చఓమనీనీ ఉద్యమం తర్వాత ఎలైట్ అకౌంటబిలిటీకి కొత్త ఎపాక్‌ను ప్రారంభిస్తున్నాయి. డబ్ల్యూఈఎఫ్ విశ్వసనీయత క్షీణించడంతో గ్లోబల్ పాలసీ చర్చలు ప్రభావితమవుతాయి. హార్వర్డ్‌లో నాయకత్వ షేకప్ విద్యా రంగంలో పరిణామాలకు దారితీస్తుంది. ఫైనాన్షియల్ రంగంలో గోల్డ్‌మన్ సాక్స్ షేర్లు 5 శాతం పడిపోయాయి, మార్కెట్ అనిశ్చితి పెరిగింది.

తెలుగు భాషకు ఖండవల్లి సేవ

తెలుగునాట తెలుగు భాష నేర్చు కోవడానికి అవకాశాలు మృగ్యమైన కాలంలో మాతృభాషపై మమకారం తో విద్యార్థులకు తెలుగు భాష నేర్చుకునే అవకాశం కల్పించడానికి ఆచార్య ఖండవల్లి లక్ష్మీ రంజనం చేసిన కృషి అనన్య సామాన్యం. సానుకూల దృక్పథంతో, అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పరిపాలనా కాలంలో తెలుగు సాహి త్యానికి, చరిత్రకు ఖండవల్లి లక్ష్మీ రంజనం విశేష సేవలు అందించా రు. ఉస్మానియా విశ్వ విద్యాలయం లో ఆచార్యుడిగా పనిచేసిన ఆయన విద్యార్థుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో తెలుగు భాషకు ప్రముఖ స్థానం లభించడం వెనుక ఆయన విశేష కృషి దాగి ఉంది. ఆంధ్రప్రదేశ్ లో ప్రథమంగా ప్రాచ్య కళాశాలను, తెలుగు మీడియం సాయం కళాశాలను, ఒక సంగీత పాఠశాలను నెలకొల్పి, వాటికి విశాలమైన భవనాలు కట్టించారు. తన ఇంటిలోనే వేద పాఠశాలను 1980లో స్థాపించి సర్వ వర్ణాల వారికి తానే వేదాన్ని స్వయంగా బోధించారు. ఆంధ్ర రచయితల సంఘానికి 1957లో అధ్యక్షులై అనేక గ్రంథాలను ముద్రించారు. ఇంగ్లీషు, తెలుగు భాషలలో శర వేగంగా రాసేవారు. మద్రాసు మెయి ల్, దక్కన్ క్రానికల్, భారతి, కృష్ణా, స్రవంతి మొదలైన పత్రికలలో అనేకమైన వ్యాసాలు ప్రకటించారు. ఖండవల్లి లక్ష్మీరంజనం (మార్చి 1, 1908 – జూన్ 18, 1986) సుప్రసిద్ధ సాహిత్యవేత్త, పరిశోధకులు. ఆయన తూర్పు గోదావరి జిల్లా పెదపూడి గ్రామంలోని మాతా మహులైన కోరాడ నరసింహులు ఇంటిలో మార్చి 1, 1908 న జన్మిం చారు. సూర్యనారాయణ, సీతమ్మ తల్లిదండ్రులు. తండ్రి ఉద్యోగ రీత్యా వరంగల్లుకు రావడంతో ఆయన మాధ్యమిక, ఉన్నత పాఠశాల విద్యలు మట్టెవాడలో, హనుమ కొండ లోను పూర్తయ్యాయి. తరువాత ఉన్నత విద్యకై హైదరాబాదు చేరుకుని 1924లో నిజాం కళాశాల లో బీఏ సంస్కృతం చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు.1928లో నిజాం కళాశాలలో తెలుగు, సంస్కృతం, ప్రాచీన భారత చరిత్రలలో బి.ఎ. పట్టా పొందారు. తరువాత సిటీ కళాశాలలో అధ్యా పకులుగా చేరి 1936లో తెలుగు, సంస్కృతాలలో ఎం.ఎ. పరీక్షలో మద్రాసు ప్రెసిడెన్సీలో సర్వ ప్రథము లుగా ఉత్తీర్ణులయ్యారు. ఖండవల్లి 1936 నుంచే సాహిత్యసేవ ప్రారం భించారు. 'తెలుగుదుక్కి' శీర్షికతో వ్యాసాలు ప్రచురించారు. త్రివేణి లాంటి ఆంగ్ల పత్రికల్లో ఆధునిక కవిత్వం గురించి అనేక వ్యాసాలు రాశారు. 1936లో ఎంఏ (తెలుగు సంస్కృ తం)లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉస్మానియా విశ్వ విద్యాలయంలో తెలుగు లెక్చరర్ గా చేరారు. రాయ ప్రోలు సుబ్బారావు పదవీ విరమణ చేశాక ఆచార్య (ప్రొఫెసర్) పీఠాన్ని అధిష్టించారు. ఖండవల్లికి విద్యార్థి దశ నుంచే ఆదిరాజు వీరభద్రరావు లాంటి పరిశోధకులతో, గోలకొండ పత్రికా సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డి లాంటి ప్రజా సాహిత్య సేవకులతో, లోకనంది నారాయణ లాంటి సాహిత్య పోషకులతో పరిచయం ఏర్పడింది. ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో అధ్యాపకులుగా చేరి, తరువాత 1946లో ఆ శాఖకు అధ్యక్షులై, 1964లో పదవీ విరమణ చేశారు. ఆయన కృషి కారణంగా తెలంగాణలో 1956 నుంచి ప్రాచ్య భాషాధ్యయనంలో డిగ్రీ తరగతులు (బీఓఎల్) మొదల య్యాయి. 1957 నుంచి ఓరియం టల్ కళాశాలలు సాయంకాలం పూట పనిచేసేలా ప్రారంభ మయ్యాయి. ఇంగ్లీషు భాషా పరిచయం లేని పేదసాదా విద్యార్థు లు ఈ కళాశాలల్లో చదివి, ఎంఏ తెలుగు, సంస్కృతం పట్టాలు పొంది కళాశాలల ఉపన్యాసకులు కాగలిగారు. 1966లో తెలుగు మాధ్యమంలో సాయం డిగ్రీ కళాశాలను స్థాపించారు. 1960లో హైదరాబాదులో వేద పాఠశాలను ప్రారంభించి, తాను కూడా తరగ తులు తీసుకునేవారు. ఉస్మానియా లో ఆయన కాలంలో తెలుగు శాఖ బాగా అభివృద్ధి చెంది, తెలుగు ఎం.ఎ. చదివే విద్యార్థుల సంఖ్య పెరిగి, 1952 నుండి తెలుగులో పి.హెచ్.డి. పట్టాలకు పరిశోధన ప్రారంభమైంది. ఆయన రాసిన పుస్తకాల్లో ఆంధ్రుల చరిత్ర? సంస్కృతి, ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము, తెనుగుదుక్కి, లక్ష్మీరంజనం వ్యాసావళి, ఆంధ్రదేశ చరిత్ర భూగోళ సర్వస్వము మూడు సంపుటాలు, కాసె సర్వప్ప రాసిన సిద్దేశ్వర చరిత్రము, శ్రీనాథుని హర విలాసము (పరిష్కరణ గ్రంథాలు) ప్రసిద్ధాలు. ఆయన ఆంధ్ర మహా భారతం పరిశోధన ప్రతిని ఎనిమిది సంపుటాలుగా తెలుగు శాఖ పక్షాన ప్రకటించారు. వివేకానంద ఎడ్యుకేషనల్ సొసైటీ పేరుతో ఒక విద్యాసంస్థను ప్రారం భించి బాల బాలికలకు వేరువేరుగా ఉన్నత పాఠశాలలను నెలకొల్పారు. కొమర్రాజు లక్ష్మణరావు... విజ్ఞాన సర్వస్వం ముద్రించడంలో ఖండవ ల్లి విశిష్టమైన కృషిచేశారు. ఆయన 'ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము' అనే చక్కని రచన చేశారు. సోదరు డు ఖండవల్లి బాలేందు శేఖరంతో కలసి తెలుగులోను, ఇంగ్లీషులోను రచించిన 'ఆంధ్రుల చరిత్ర – సంస్కృతి' అమూల్యమైన గ్రంథం. హైదరాబాద్ లోని శ్రీకృష్ణదేవరాయ గాంధ్ర భాషా నిలయం కార్యదర్శిగా రెండేళ్లపాటు పనిచేశారు. పుస్తకాల సేకరణ, చందాల కోసం తెలంగాణ అంతటా పర్యటించారు. వర్ధంతు లు, జయంతులు ఎన్నో జరిపారు. ఆంధ్ర సారస్వత పరిషత్ సభ్యులు గా పనిచేసి దాని విస్తరణకు విశేష కృషి చేశారు. 'నిజాం రాష్ట్ర గ్రంథాలయ సంఘం' కార్యదర్శిగా కూడా పనిచేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధ్యక్షులుగా 1964లో విశ్రాంతి తీసుకున్నాక, మరో 22 సంవత్సరాలు సాహిత్య సేవ చేసి, 1986, జూన్ 18న హైదరాబాద్‌లో మరణించారు. ఆయన స్థాపించిన ఆంధ్ర ప్రాచ్య కళాశాల ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం ప్రభుత్వ ప్రాచ్య కళాశాలగా అభివృద్ధి చెందింది. ఖండవల్లి శత జయంతి, కళాశాల స్వర్ణోత్సవాలు 2008లో హైదరాబాదులో ఘనంగా జరిగా యి. ఈ సందర్భంగా ప్రత్యేక సంచికను ప్రచురించారు.

గర్వించదగ్గ సివిల్ సర్వంట్

ఒక సాధారణమైన టైలర్ కుటుంబంలో జన్మించి సామాజికంగా, ఆర్థికంగా ఎన్నో ఒడిదొడుగులను ఎదుర్కొని భారతదేశం గర్వించదగిన స్థానంలో నిలిచారు పరికిపండ్ల నరహరి, ఐఏఎస్.తను పదవ తరగతి చదువుతున్న రోజుల్లోనే ఐఏఎస్ అధికారి కావాలని ధృఢ సంకల్పంతో... ఆ దిశగా అడుగులు వేస్తున్న క్రమంలో అడుగడుగున ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తన తండ్రితో మొదటి సారి ఇంజనీరింగ్ కౌన్సిలింగ్ కోసం హైదరాబాద్ వెళ్ళినప్పుడు భోజనం చేయడానికి కూడా డబ్బులు లేని పరిస్థితిని ఈ రోజుకు కూడా పలు సందర్భాల్లో ఆయన గుర్తు చేసు కుంటారు. ఎన్ని కష్టాలు వచ్చిన తన గమ్యం ముందర అవి చిన్నగానే కనిపించేవనీ చెప్తారు. ఇంటి నుండి ప్రతి నెల డబ్బులు పంపించలేని పరిస్థితి ఉండడంతో నెలవారీ ఖర్చులకోసం ట్యూషన్స్ చెప్తూ ఇంజనీరింగ్ లో యూనివర్సిటీ టాపర్ గా నిలిచిన గొప్పతనం ఆయనది. ఇంజనీరింగ్ పూర్తి చేసుకొని ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసేస్‌లో ఉత్తీర్ణత సాధించి ఒక సంవత్సరం పాటు సైంటిస్ట్ గా సేవలు అందించారు. ఆర్థిక ఇబ్బందుల వలన ఒక సంవత్సరం పాటు ఎఖా ఉద్యోగం చేసి తరువాత ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రభుత్వ స్టడీ సర్కిల్లో పూర్తి స్థాయిలో సివిల్స్ కోసం ప్రిపరేషన్ మొదలు పెట్టారు. 2001 లో సివిల్స్ లో ఆల్ ఇండియా 84వ ర్యాంక్ సాధించి మధ్య ప్రదేశ్ క్యాడర్ ఎయా అధికారిగా నియమింపబడ్డారు. ఎన్నో ఆశలు, ఆశయాలతో ఆ స్థానంలో నిలిచిన వారు ప్రతి పోస్టింగ్ లో తన మార్క్ పనితనంతో ప్రజల మరియు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మన్ననలు పొందుతున్నారు. మునిసిపల్ కమిషనర్ మొదలుకొని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శిగా మధ్య ప్రదేశ్ లోని ఎన్నో జటిలమైన సమ్యసలకు సమాధానంగా నిలిచారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అందించిన అవార్డులే వారి పని తీరుకు నిదర్శనం.నరహరి హమారా లాడ్లి లక్ష్మి యోజన(బంగారు తల్లి) పథకం రూపొందించారు. భేటీ బచావో – భేటీ పడావో పథకానికి పునాదులు వేసారు.సోషల్ మీడియా ద్వారా గ్రీవియన్స్ మొదలుపెట్టిన మొదటి ఐఏఎస్ అధికారిగా నిలిచారు. హరియాలి (హరిత హారం) అనే కార్యక్రమంతో ఒకే రోజు లక్ష మొక్కలని నాటించారు. ఇండోర్ సిటిని స్వచ్ సర్వెక్షన్ లో క్లీనేస్ట్ సిటి ఆఫ్ ఇండియా గా నిలిపారు. ఇండోర్ జిల్లాని బహిరంగ మల మూత్ర విసర్జన రహిత జిల్లాగా నిలిపారు. గ్వాలియర్ జిల్లాలోని 95 శాతం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మరియు జనసంద్రంగా ఉండే ప్రదేశాల్లో దివ్యాంగులకోసం కచ్చితంగా రాంప్ లు కట్టించారు. స్కిల్ డెవలప్మెంట్ స్కీమ్స్ ద్వారా ఒక్క సంవత్సరంలో 36 లక్షల మంది యువకులకు బ్యాంకుల ద్వారా ఋణాలు ఇప్పించే కార్యక్రమం చేపట్టారు.నరహరి ఎన్నో రాష్ట్ర ప్రభుత్వ అవార్డులు అందుకున్నారు. వికలాంగులకోసం వారు చేసిన సేవలను మరియు స్వచ్ సర్వెక్షన్ – ఇండోర్ కు గానూ కేంద్ర ప్రభుత్వం గుర్తించి రాష్ట్రపతి అవార్డు అందించారు.ప్రతి సంవత్సరం భారతదేశ ఉత్తమ ఐఏఎస్ అధికారులలో పలు ఏజెన్సీస్ మరియు ప్రభుత్వం ఇచ్చే జాబితాలో టాప్ 5 ఐఏఎస్ అధికారిగా నిలిచారు.మధ్య ప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారిగా విధులు నిర్వర్తిస్తు అన్ని విజయాలు సాధించినప్పటికి తను పుట్టిన గడ్డకి సేవా చేయాలని ఆలోచనతో తన మిత్ర బృందం ద్వారా ఆలయ ఫౌండేషన్ ని స్థాపించి విద్యా, వైద్య మరియు ఉపాధి రంగాలలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.మారుమూల గ్రామాల్లో, తండాల్లో మెడికల్ క్యాంప్స్ నిర్వహిస్తున్నారు. తలసెమ్మియా పిల్లల కోసం రక్తదాన శిబిరాలు వందలాది కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.వెయ్యి మందికి పైగా వికలాంగులకు కృత్రిమ అవయవాలు, వీల్ చైర్స్, ట్రై సైకిల్స్, వినికిడి యంత్రాలను అందించారు, నిరంతరాయంగా అందిస్తున్నారు. ఎన్నో పాఠశాలల్లో, కళాశాలల్లో, యూనివర్సిటీలలో స్వయంగా వ్యక్తిత్వ వికాసా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మోటివేషనల్ స్పీకర్స్ ద్వారా వేల సంఖ్యలో కార్యక్రమాలు ఫౌండేషన్ ద్వారా చేపట్టారు.కార్పొరేట్ కంపెనీలలో యువతీ, యువకులకు ఉచిత నైపుణ్య శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు.బసంతనగర్ లో శంకర వారి సహకారంతో ఆలయ ఫౌండేషన్ ఉచిత కంటి ఆసుపత్రి నిర్మించి వేల సంఖ్యలో నిరంతరాయంగా ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. రాజ్యాంగ బద్ధంగా అన్ని అవకాశాలు అందరికీ దక్కాలి, నిర్ణయాత్మకమైన స్థానాల్లో అన్ని వర్గాల ప్రజలు ఉంటేనే సామాజిక న్యాయం జరుగుతుందని, నాయకులుగా ఎదిగే అవకాశం అందరికి రావాలని, నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసే ఆలోచన ఉన్న యువతకి లీడర్షిప్ ట్రైనింగ్ క్లాసెస్ జన అధికార సమితి ద్వారా నిర్వహిస్తున్నారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అన్ని అవకాశాలు అన్ని వర్గాలు అందిపుచ్చుకొని విధంగా అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నారు.

స్కామ్ కథ కంచికేనా?

కథలన్నీ కంచికి చేరతాయో లేదోగానీ... రాజకీయ ప్రయోజనాలనాశించి పెట్టే కేసులన్నీ, సీబీఐ, ఈడీల సుదీర్ఘ దర్యాప్తు అనంతరం గాలికి కొట్టుకుపోతున్నాయి. ఆ వరసలో ఢిల్లీ మద్యం కుంభకోణం కేసు తాజా ఉదాహరణ. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాలతోపాటు 23 మందిపై అవినీతి, కుంభకోణం ఆరోపణలు చేస్తూ 2022లో సీబీఐ దాఖలు చేసిన కేసులో అందరూ నిర్దోషులని ఢిల్లీ న్యాయస్థానం ఇచ్చిన తీర్పు సీబీఐకి చెంపపెట్టు. పనిలో పనిగాతెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను రాజకీయంగా దెబ్బతీసేందుకు ఆయన కుమార్తె, తెలంగాణ జాగృతి సంస్థ వ్యవస్థాపకురాలు కవితను కూడా నిందితురాలిగా చేర్చారు. ఆమె సైతం ఇప్పుడు నిర్దోషిగా తేలారు. 2021లో ఢిల్లీ ప్రభుత్వం కొందరికి లబ్ధి చేకూరేలా మద్యం విధానం తీసుకొచ్చిందంటూ ఈ కేసు అల్లారు. అధికారంలో కొచ్చిన ఏ రాజకీయ పక్షమైనా అమల్లో ఉన్నవాటిని కాదని, తమ ఆలోచనలకు అనుగుణంగా కొత్త విధానాలు ప్రవేశపెడుతుంది. అవన్నీ సరైనవి కాకపోవచ్చు. వాటి వెనక స్వీయ ప్రయోజనాలుండొచ్చు. ఆ నిర్ణయాల పర్యవసానంగా ఖజానా నష్టపోతే, ప్రజల ప్రయో జనాలు దెబ్బతింటే చర్యలు తీసుకోవాల్సిందే. వాటినెవరూ ప్రశ్నించరు. కానీ అందుకు తగిన మౌలిక ఆధారాలు, ప్రాతిపదిక ఉండాలి. విధానం మార్చడం దానికదే ఒక కుంభ కోణంగా చిత్రించటం, ఆ పేరిట కేసులు, అరెస్టులతో వేధించటం, ఏళ్ల తరబడి దర్యాప్తు, చివరకు నిరూపించలేక న్యాయస్థానాలతో చీవాట్లు తినడం ఏం మర్యాద? ఇందువల్ల దర్యాప్తు సంస్థల విశ్వసనీయత దెబ్బతినడం లేదా? తాత్కాలికంగా మీడియాలో భారీ యెత్తున ప్రచారం జరగొచ్చు. నిప్పు లేనిదే పొగ రాదని జనం అభిప్రాయపడేలా చేయొచ్చు. ఎన్ని చేసినా ఆరోపణల్ని రుజువు చేయటం అంతిమంగా దర్యాప్తు సంస్థ బాధ్యత. పత్రికల్లో రోజుల తరబడి పతాక శీర్షికలు ఆక్రమించి, టీవీ చానెళ్లలో గంటల తరబడి చర్చలకు కారణమైన కేసులు చివరకు దూదిపింజెల్లా తేలిపోవటం, గాలి పోగేయటం తప్ప ఇందులో ఆవగింజంతైనా వాస్తవం లేదని తేలడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇక ఈ కేసుల్ని ఆధారం చేసుకుని సామాజిక మాధ్యమాల్లో ఎవరికివారు ఇష్టానుసారం వ్యాఖ్యా నాలు చేయటం, అవమానించేలా శీర్షికలు పెట్టడం మరో ప్రహసనం. ఎవరికీ తెలియని 'సౌత్ గ్రూప్'ను సృష్టించి, దానికి లబ్ధి కలిగేలా కేజ్రీవాల్ ప్రభుత్వం కొత్త మద్యం విధానం తెచ్చిందని, ఇందులో రూ. 100 కోట్లు చేతులు మారాయని ఆరోపిస్తూ అప్పటి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సీబీఐ విచారణకు ఆదేశించారు. 2023 ఫిబ్రవరిలో మనీశ్ సిసోడియానూ, 2024 మార్చిలో కవితనూ, కేజ్రీవాల్‌నూ అరెస్టు చేశారు. అన్ని కేసుల్లో మాదిరే ఇక్కడ కూడా మనీశ్ సన్నిహితుడు దినేశ్ అరోరా, ఏపీకిచెందిన మాగుంట రాఘవరెడ్డి, శరత్ చంద్రారెడ్డి వంటివారిని అప్రూవర్లుగా మార్చుకున్నారు. ఈ ముగ్గురూ పూసగుచ్చినట్టు చెప్పారంటూ లీకులిచ్చారు. కానీ అలా అంటే సరిపోదు... వాటిని ధ్రువపరిచే సాక్ష్యాలుండాలి. కోట్లాది రూపాయలు చేతులు మారాయని ఆరోపిస్తే కాదు... అంత మొత్తం ఎలా ప్రయాణించిందో, ఏయే ఖాతాలకు మళ్లిందో చూపాలి. అడుగడుగునా ఆధారాలుండాలి. ఫలానా అంశాలు రాబట్టామని ఏకరువు పెట్టినంత మాత్రాన కుదరదు. వాటిమధ్య పరస్పర సంబంధాన్ని సందేహాతీతంగా రుజువు పరచాలి. ఆ సంగతలా ఉంచి కనీసం అవినీతి నిరోధకచట్టం సెక్షన్ 7, 13 కింద ఆరోపించిన లంచం ఆరోపణల్ని కూడా సీబీఐ ప్రాథమికంగా నిరూపించలేకపోయింది. అందుకే కాబోలు దర్యాప్తు అధికారిపై శాఖాపరమైన చర్యకు కోర్టు ఆదేశించింది. అయితే ఈ కేసులో సీబీఐ అప్పీలుకెళ్లింది.

ఇరాన్‌ను ముంచిన "చైనా ఆయుధ వ్యవస్థలు"

ప్రతిఘటన, నేషనల్ బ్యూరో

మేడ్ ఇన్ చైనా వ్యవస్థలు ఎలా ఉంటాయో మరోసారి ప్రపంచానికి తెలిసొచ్చింది. గతంలో భారత్ పాకిస్తాన్‌పై నిర్వహించిన "ఆపరేషన్ సిందూర్" సమయంలో మన క్షిపణుల్ని పాకిస్తాన్‌లో మోహరించిన చైనీస్ వైమానిక రక్షణ వ్యవస్థలు అడ్డుకోలేకపోయాయి. ఇటీవల, ఆఫ్ఘాన్‌పై పాక్ దాడి చేసిన తర్వాత, తాలిబన్లు పాక్ రాజధాని ఇస్లామాబాద్‌పై డ్రోన్ దాడి చేశారు. ఈ సమయంలో కూడా చైనా ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ వీటిని పసిగట్టలేకపోయాయి. తాజాగా, ఇరాన్‌ను కూడా చైనీస్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్‌ను నమ్ముకుని ఘోరంగా దెబ్బతింది. ఇజ్రాయిల్, యూఎస్‌లు యథేచ్ఛగా మిసైల్స్, ఎయిర్ స్ట్రైక్స్ చేస్తున్నా చైనా తయారీ నూ-9దీ రక్షణ వ్యవస్థ వద్ద సమాధానమే లేకుండా పోయింది. ఇజ్రాయిల్ సృష్టించిన విధ్వంసానికి ఇరాన్ టాప్ లీడర్ షిప్ మరణించారు. ఏకంగా సుప్రీం లీడర్ ఆయతొల్లా అలీ ఖమేనీ హతమయ్యాడు.ఇరాన్ చైనా నుంచి కొనుగోలు చేసిన నూ-9దీ గగనతల రక్షణ వ్యవస్థ విఫలమైనట్లు తెలుస్తోంది. తమ ఆస్తుల్ని రక్షిస్తుందని ఇరాన్ ఎంతో నమ్మకంతో కొనుగోలు చేసిన ఈ వ్యవస్థ చివరకు ఇజ్రాయిల్, యూఎస్ దాడుల ముందు చేతులెత్తేసింది. వస్తున్న గగనతల ముప్పును తటస్థీకరించలేకపోయింది. 260 కి.మీ దూరంలోని లక్ష్యాలను, 50 కి.మీ ఎత్తులో ఉన్న విమానాలను కూల్చగలదని చైనా చెబుతోంది. కానీ రియల్ టైమ్‌లో చేతులెత్తేస్తోంది. ఇది ఒకేసారి 100 లక్ష్యాలను గుర్తించి, 6-8 క్షిపణుల్ని అడ్డుకోగల సామర్థ్యం ఉందని చెబుతుంటారు. ఇరాన్‌లోని నటాంజ్ అణు కేంద్రం, ఫోర్డో యురేనియం ఎన్‌రిచ్మెంట్ ప్లాంట్, ముఖ్యమైన మిసైల్ బేస్‌ల వద్ద వీటిని మోహరించినప్పటికీ అక్కడ భారీ నష్టం వాటిల్లింది. అమెరికా, ఇజ్రాయిల్ క్షిపణులు వేగం, ఆధునాతన సాంకేతికత ముందు చైనా వ్యవస్థలు నిలవలేదని యుద్ధరంగ నిపుణులు భావిస్తున్నారు.

అమరుల త్యాగాల పునాదుల మీద వర్గీకరణ సాధించాం

ప్రతిఘటన, నాగర్ కర్నూల్ బ్యూరో
రిపోర్టర్ విజయ్ కాంత్

మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం మార్చి 1ను పురస్కరించుకొని నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం దగ్గర మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్, మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. 30 సంవత్సరాల సుదీర్ఘ ఎంఆర్పీఎస్ పోరాటంలో అమరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ మార్చి 1న మాదిగ అమరవీరుల దినోత్సవం ప్రతి ఏటా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. వర్గీకరణ పోరాటంలో తమ అసమాన త్యాగాలను తృణప్రాయంగా అర్పించి జాతి ఉద్యమానికి అమరులు తీవ్రమైన కృషి చేశారన్నారు. అందులో భాగంగానే ఎస్సీ ఎబిసిడి వర్గీకరణ సాధించుకోవడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో ఇదే స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లి సమాజంల్లో అసమానతలు తొలగించడంతో పాటు భారత రాజ్యాంగంలోని ప్రతి అంశాన్ని, హక్కులు ఈ దేశంలోని ప్రతి ఇంటికి చేర్చే విధంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నూతన పోరాటాలకు శ్రీకారం చుడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోళ్ల శివ మాదిగ ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, గూట విజయ్ మాదిగ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు, దేవరపాగ ప్రభాకర్ మాదిగ ఎం ఈ ఎఫ్ జిల్లా అధ్యక్షులు, కరిగేళ్ల దశరథం మాదిగ ఎం ఎస్ పీ జిల్లా అధ్యక్షులు, గుడిగానిపల్లి రాజు మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు, కాళ్ళ ప్రసాద్ మాదిగ ఎం ఈ ఎఫ్ డివిజన్ అధ్యక్షులు, భాస్కర్ మాదిగ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు, ఎం ఈ ఎఫ్ లక్ష్మణ్ మాదిగ, ఎం ఈ ఎఫ్ నాగ లక్ష్మణ్ మాదిగ, మహేంద్ర నాథ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంజయ్య నగర్ కాలనీ అభివృద్ధే నా ధ్యేయం

గచ్చిబౌలి ; అంజయ్య నగర్ కాలనీలో పాక్షికంగా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపించిన అంజయ్య నగర్ కాలనీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మోడల నర్సింహ్మ సాగర్.కాలనీ వాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంజీరా వాటర్ లైన్ ను పరిశీలించి మరమ్మతులు చేపట్టడం జరిగింది.గతుకుల రోడ్లలకు మరమ్మతులు చేసి అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చినందుకు కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రమేశ్,శివ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

చందిప్ప మరకత శివలింగానికి పూజలు చేసిన సినీ నటుడు స్వర్గీయ మల్లికార్జున రావు తనయుడు...

శంకర్ పల్లి; రంగారెడ్డి జిల్లా, శంకర్ పల్లి మండలం చందిప్ప గ్రామంలో వెలసిన మరకత శివలింగానికి ఆదివారం సినీ నటుడు స్వర్గీయ మల్లికార్జునరావు కుమారుడు శ్రీనివాస్ కోడలు లలిత అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. కాగా గత నెల మరకత శివాలయ ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్ రాజు విశాఖపట్నం పర్యటనలో భాగంగా సినీ నటుడు స్వర్గీయ మల్లికార్జున రావు కుటుంబ సభ్యులను కలిసి ఒకసారి చందిప్ప గ్రామంలో వెలిసిన శివాలయానికి రావాలని ఆహ్వానించడం జరిగింది. ఆ క్రమంలో శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు విశాఖపట్నం నుండి చందిప్ప గ్రామానికి వచ్చి మరకత శివలింగానికి నిర్వహించడం పూజలు జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆహ్లాదకర వాతావరణంలో దేవాలయం ఉందని, ఆకుపచ్చ శివలింగానికి పూజలు చేయడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. అనంతరం దేవాలయ చైర్మన్ గోపాల్ రెడ్డి, శివాలయ ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్ రాజు, దేవాలయ కమిటీ సభ్యుడు హనుమంతు ఆ దంపతులను శాలువతో సత్కరించి మరకత శివలింగం గల చిత్రపటాన్ని అందించారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డులోకి శంకర్‌పల్లి బృంద నృత్యం

శంకర్ పల్లి : మానుకోట ప్రసాద్ రచించిన, ప్రముఖ గాయకుడు వందేమాతరం శ్రీనివాస్ గానం చేసిన రైతే రాజు, రైతుకు వందనం' నృత్యానికి వండర్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం లభించింది. శనివారం రాత్రి నగరంలోని ఎల్బీ స్టేడియంలో శ్రీ సాయి అలేఖ్య ఆర్ట్స్, వీవీకే విజన్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శంకర్‌పల్లి పట్టణానికి చెందిన సంస్కృతి నృత్యాలయం గురువు అనుషా రెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులు చేసిన నృత్యానికి వరల్డ్ రికార్డు సొంతమైంది.

నిరుద్యోగాన్ని అంతం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

రాష్ట్ర వార్షిక బడ్జెట్లో యువజన రంగానికి అధిక నిధులు జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి

ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర

ప్రతిఘటన, హైదరాబాద్ ప్రతినిధి నిరుద్యోగాన్ని అంతం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర విమర్శించారు. ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం హిమాయత్ నగర్ లోని సత్యనారాయణరెడ్డి భవన్ లో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ.. మన దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం వల్ల తీవ్ర ఆందోళన వ్యక్తమవుతుందన్నారు. అటు ప్రభుత్వ రంగం నుండి కొత్త ఉద్యోగ ప్రకటనలు తక్కువగా రావడం, ఇటు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కోల్పోవడం, ఈ రెండు కలసి ఒక కుంభమేళలాగా నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నియామక ప్రక్రియలు చాలా నెమ్మదిగా జరగడం, గ్రూప్ పరీక్షల ప్రకటనలు సంవత్సరాల తరబడి అలస్యం అవుతుండగా, నియామకాల్లో తారతమ్యాలు, కోర్టుల స్టేలు, రాజకీయ ప్రతిస్పందనలు మరింత కల్లోలం సృష్టిస్తున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో యువతి యువకులు తమ జీవిత భద్రతపై ఆశను కోల్పోతున్నారన్నారు. రాబోయే 10-20 ఏళ్లలో మనం తీవ్ర సంక్షోభాన్ని, సామాజిక అసమతుల్యతను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి పరిష్కార మార్గాలు ఉన్నప్పటికీ, వాటిని అమలు చేయాలన్న చొరవ పాలకుల నుండి కనిపించడం లేదన్నారు. ఉద్యోగ నియామక ప్రక్రియలు వేగవంతం చేయాలని, ఖాళీలను నిబద్ధతతో నింపాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే అని అన్నారు. నిరుద్యోగ యువతకు నిరంతరం ధైర్యం ఇచ్చే విధంగా ప్రభుత్వ రంగం ముందుకు రావాలని, ప్రైవేట్ రంగానికి నిబంధనలు విధించాలని, ఉద్యోగుల తొలగింపుల విషయంలో కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక చట్టాలను రూపొందించాలన్నారు. కర్మాగారాలు, సంస్థలు తమ సామాజిక బాధ్యతను గుర్తించాలని కోరారు. నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఆర్థిక మద్దతు లేదా స్వయం ఉపాధి యోజనాల ద్వారా భరోసా కల్పించాలన్నారు. నవతరానికి సామాజిక భద్రత, పెన్షన్, ఆరోగ్యబీమా, విద్యా సహాయం వంటి రంగాల్లో యువతకు మద్దతు ఇవ్వడం ద్వారా వారి భవిష్యత్తుపై నమ్మకాన్ని పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై వున్నదని అన్నారు. ఈ మార్గాల్లో చర్యలు తీసుకోకపోతే రేపటి సమాజం ఘోర సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోదీ ప్రభుత్వం గడిచిన 12 ఏండ్ల కాలంలో బడా కార్పొరేట్ లకు 15 లక్షల కోట్ల రూపాయల దేశ సంపదను అక్రమంగా దోచి పెట్టిన నీచ చరిత్రను మూటగట్టుకున్నారని వారు ధ్వజమెత్తారు.గతంలో బడా కార్పొరేట్ శక్తులు ప్రభుత్వం కు 37 శాతం పన్ను కడితే, ఈ బీజేపీ హయాంలో దానిని 16 శాతానికి తగ్గించారని, దీని కారణంగా దేశ సంపదకు 9లక్షల కోట్ల రూపాయలు నష్టం వాటిల్లిందని ఆరోపించారు. బడా కుబేరులకు యథేచ్ఛగా రాయితీలు ప్రకటించి, సామాన్యుల జీవన పరిస్థితులను దేశ వ్యాప్తంగా దుర్భర స్థితికి మార్చిన చరిత్ర మోడీ ప్రభుత్వానిదని దుయ్యబట్టారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది నిరుద్యోగ యువత ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం మరియు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఇప్పటికీ సంపూర్ణ జాబ్ క్యాలెండర్ ప్రకటించకపోవడం తీవ్ర అన్యాయం అని, ప్రభుత్వ శాఖల్లో లక్షల సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ, వాటి భర్తీకి సంబంధించి స్పష్టమైన కాలపట్టిక ఇవ్వకపోవడం వల్ల యువతలో అయోమయం, ఆందోళన పెరుగుతోందని, ఇది కేవలం పరిపాలనా వైఫల్యం అని, ఈ నెలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న వార్షిక బడ్జెట్లో యువజన రంగానికి అధిక నిధులు కేటాయించాలని, జాబ్ క్యాలెండర్ ను విడుదల చేయాలని,రాజీవ్ యువ వికాస పథకాన్ని అమలు చేయాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు మొగిలి లక్ష్మణ్, కొంకుల రాజేష్, ఎత్తం మహేష్, కళ్యాణ్, ప్రవీణ్, నర్సింహా, నవీన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రమాణ స్వీకారం

ముఖ్యఅతిథిగా హాజరైన మల్ రెడ్డి రామ్ రెడ్డి

ప్రతిఘటన, ఎల్బీనగర్ ప్రతినిధి నాగోల్ అనంతుల జంగా రెడ్డి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చై ర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రటరీ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, నాగోల్ మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, నాగోల్ సీఐ మక్బూల్ జానీ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి, కాలనీ అధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి, మాజీ అధ్యక్షులు భాస్కర్, జనరల్ సెక్రటరీ డా.చందులతో పాటు నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి సంఘం సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, నియోజకవర్గంలోని ప్రతి కాలనీనీ సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్ అమలుతో ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. మీకు ఎలాంటి సమస్యలు ఉన్న మా దృష్టికి వస్తే, పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాగోల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు

మంజులా రెడ్డి, చంపాపేట్ డివిజన్ అధ్యక్షులు దాచర్లపల్లి శ్రీపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పన్యాల జైపాల్ రెడ్డి, మెగావత్ గణేష్ నాయక్ గారు, ఆలయ ధర్మకర్తలు తోకటి కిరణ్, శ్రీనివాస్, నాయకులు సోలిపురం వెంకట్రామ్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ఆదివాసి గిరిజన వైస్ చైర్మన్, బంజారా జన సమితి రాష్ట్ర అధ్యక్షులు కే.గాంధీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలి

ఐద్వా మండల కార్యదర్శి కొండమడుగు నాగమణి డిమాండ్

ప్రతిఘటన, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి జంగిటి రవీందర్ అధికారంలోకి వస్తే మహిళలకు సంబంధించిన సమస్యలన్నింటినీ పరిష్కరించి వారి సంక్షేమానికి పెద్ద ఎత్తున పాటు పడతామని చెప్పి హామీలు ఇచ్చి గెలిచి రెండు ఏళ్లు గడిచిపోయిన ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) భువనగిరి మండల కార్యదర్శి కొండమడుగు నాగమణి విమర్శించారు. ఆదివారం ఐద్వా రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఒక్కరోజు సభ్యత్వ కార్యక్రమాన్ని భువనగిరి మండలం ముత్తిరెడ్డి గూడెం గ్రామంలో ఇంటింటికి ఐద్వా నాయకత్వంతో కలిసి సభ్యత్వం చేర్పించడం జరిగింది. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ కానుక పేరుతో కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని, మహాలక్ష్మి కింద నెల నెల మహిళలకు రూ.2500 ఇస్తామని, విద్యార్థినీలకు స్కూటీలు, బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలకు, వితంతువులకు పింఛన్ పెంపు వంటి హామీలేవి అమలు చేయకుండా మొండి చెయ్యి చూపిస్తున్నదని మండిపడ్డారు. డ్వాక్రా గ్రూపులకు వడ్డీ లేని రుణాలు ఇస్తానని నేటికీ ఇవ్వడం లేదని, గ్యాస్ సబ్సిడీ కూడా అందడం లేదని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కూడా అమలు చేయలేదని కేవలం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం మినహా ఏది అమలు చేయడం లేదని ఈ ఆర్టీసీ బస్సు కూడా అన్ని గ్రామాలకు రావడం లేదని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల మీద దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు పెరిగాయని విమర్శించారు. నాటి మనువాద సిద్ధాంతాన్ని మళ్లీ తీసుకొచ్చి మహిళలను వంటింటికే పరిమితం చేయాలనే ఆలోచనలను చేస్తున్నదని అన్నారు. ఈ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలు కోసం మహిళలు ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం

కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల సహాయ కార్యదర్శి కొండ హైమావతి, వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షురాలు కూకుట్ల చొక్కాకుమారి, గ్రామానికి సంబంధించిన కొండ శోభారాణి, రాంపల్లి కృష్ణవేణి, రాంపల్లి కలమ్మ, ఎడ్ల జ్యోతి, ఎడ్ల పుష్ప, ఎడ్ల సునీత, ఆకారం తులసమ్మ, బొజ్జ హేమలత, మెరుగు సుశీల, మెరుగు మహేశ్వరి, గొటి మంజుల తదితరులు పాల్గొన్నారు.

వీధుల్లో చీకట్లు

మరమ్మతులకు సామగ్రి కరువు
కొనుగోలు చేయలేని బల్దియా

కరీంనగర్ : : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని అనేక ప్రాంతాల్లో వీధులన్నీ రాత్రయితే చీకట్లు కమ్ముకుంటున్నాయి. ముఖ్యంగా విలీన గ్రామాల్లో అయితే, పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారింది. తమ ప్రాంతాల్లో వీధిదీపాలు వెలగడం లేదని స్థానికులు, ప్రజాప్రతినిధులు అనేక మార్లు అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకునే దిక్కులేకుండా పోయింది. ఈ విభాగంలో సామగ్రి లేకపోవడంతో వీధిదీపాల నిర్వహణ, కొత్త లైట్ల ఏర్పాటు, మరమ్మతులు పూర్తిగా నిలిచిపోయినట్లు తెలుస్తోంది. ఏడాది కాలానికి పైగా వీధిదీపాల నిర్వహణకు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. నగరపాలక సంస్థ నుంచి అరకొరగా కేటాయిస్తున్న నిధులు వీదిధీపాల విభాగాలను కొనుగోలు చేయటానికి సరిపోవడం లేదని సిబ్బంది పేర్కొంటున్నారు. దీంతో ఎక్కడైనా మరమ్మతులు వస్తే వాటిని బాగు చేసే పరిస్థితి కూడా లేకుండా పోయింది. గతేడాది సుమారు రూ.60 లక్షలతో సామగ్రి కొనుగోలు చేసిన అది ఏ మూలకూ సరిపోలేదన్న విమర్శలు వస్తున్నాయి.

సామగ్రి లేదు.... మరమ్మతులు కరువు

నగరంలో సుమారు 2 వేలకు పైగా వీధిదీపాలకు మరమ్మతులు చేయాల్సి ఉంది. అయితే, వీటికి సంబంధించి విడిభాగాలు అందుబాటులో లేవని తెలుస్తోంది. అలాగే, విస్తరిస్తున్న కాలనీల్లోనూ కొత్తగా వేస్తున్న పోల్స్‌కు వీధిదీపాలు ఏర్పాటు చేసే పరిస్థితి లేకుండా పోయింది. నగరంలోని కాపువాడ, అశోక్‌నగర్, భగత్‌నగర్, రాంచంద్రపూర్‌కాలనీ, భాగ్యనగర్, తదితర ప్రాంతాల్లో అనేక వీధుల్లో వీధిదీపాలకు మరమ్మతులు లేకపోవడంతో రాత్రయితే వీధులు చీకటిమయమవుతున్నాయి. మరమ్మతులు చేయాలని అధికారులకు సూచించినా సామగ్రి లేకపోవడంతో చేయడం లేదని కార్పొరేటర్లే చెబుతుండడం గమనార్హం. ఈ నేపథ్యంలో నూతన పాలకవర్గం వీధిదీపాల విషయంలో దృష్టి సారించాల్సినా అవసరం ఉంది.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తపల్లి/ కలెక్టరేట్, ఫిబ్రవరి 28 : హైదరాబాద్ బోయినపల్లిలోని వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో 5వ తరగతి ప్రవేశాల కోసం అర్హత గల గిరిజన బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతోపాటు పలు తరగతులలో ఖాళీగా ఉన్న 21 సీట్లను సైతం భర్తీ చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు.. విద్యార్థులు ఈనెల 12లోగా తమ దరఖాస్తులను కరీంనగర్‌లోని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందజేయాలని, ఇతర వివరాలకు 8686451313 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సేల్స్ అసిస్టెంట్, రిటైల్ నైపుణ్యాల్లో శిక్షణ

తిమ్మాపూర్, ఫిబ్రవరి 28: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల మహిళా ప్రాంగణంలో రిటైల్, సెల్స్ అసిస్టెంట్ నైపుణ్యాలపై ఉమ్మడి జిల్లా మహిళా యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రాంగణం మేనేజర్ సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ దయాల్ ఉపాధ్యాయ కౌశల్య యోజన పథకం కింద గ్రామీణ యువతకు రిటైల్ రంగంలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఈ శిక్షణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. పదో తరగతి చదివి, 18 నుంచి 35 ఏండ్ల వయసున్న వా రు రెండు ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో ఎల్ఎండీ కాలనీలోని ప్రాంగణంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7660022511 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టు

గట్టుప్పల్ : గట్టుప్పల్ తాసీల్దార్ కార్యాలయం అక్రమాలకు అడ్డాగా మారింది. కాసులకు కకుర్తి పడి.. చేతులు తడిపితే చాలు.. ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టుగా భూములను సృష్టించి అధికారులే విక్రయిస్తున్నారు. పైరవి కారులకు వంత పాడుతూ, ధనార్జనే ధ్యేయంగా దళారుల అవతారం ఎత్తుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేస్తున్న అధికారులు అక్రమార్జనకు పాల్పడుతున్నారు. రెవెన్యూ చట్టంలోని లొసుగులను అవకాశంగా తీసుకొని జేబులు నింపుకుంటున్నారు. అధికార పార్టీ నాయకులకు వంత పాడుతూ... తమకు ఎవరూ అడ్డు లేరనే ధోరణిలో అధికారులు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. భూములకు రక్షణ కల్పించాల్సిన తాసీల్దారే అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడుతూ అక్రమారులకు కొమ్ముకాస్తూ అధికార పార్టీ కనుసన్నల్లో పనిచేయడంతో అనుమానాలు వస్తున్నాయి.

మిగులు భూమి లేకున్నా పట్టాలు జారీ..

తేరట్ పల్లిలో సర్వే నం. 444లో 7 ఎకరాల 7 గుంటల భూమికి గాను అదనంగా మరో ఇద్దరు పట్టాదారులను చేర్చి 7 ఎకరాల 27 గుంటలకు విస్తీర్ణం పెంచారు. ఉండాల్సిన భూమి కన్నా 20 గుంటల భూమి ఎలా వచ్చిందో ఆ దేవునికే ఎరుక.

పట్టా ఓచోట.. కబ్జా మరోచోట..

మండల కేంద్రంలో సర్వే నంబర్ 2లో పాత రికార్డుల ఆధారంగా పహాణీలను సైతం పకనపెట్టి పొంతన లేని కాగితాలతో అధికార పార్టీ అండ దండతో ఓ వ్యక్తికి స్థానిక తాసీల్దార్ రిజిస్ట్రేషన్ చేశారు. నిబంధనలకు పాతరేసి వసూళ్లకు పాల్పడి మరీ ఈ పనిచేస్తున్నట్లు కార్యాలయ సిబ్బంది గుసగుసలాడుతున్నారు. దానికి తోడు పట్టా ఓచోట, కబ్జా ఓచోట ఉన్నా అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు అండతో లక్షల్లో విలువచేసే భూమిని కబ్జా చేసినట్లు తెలిసింది. గతంలో ఈ కార్యాలయంలో కొన్ని రోజుల పాటు పనిచేసిన ఓ ప్రైవేట్ వ్యక్తికి కూడా సర్వేనెంబర్

2లో కొంత భూమి రిజిస్ట్రేషన్ అయినట్లు ఆరోపణలు ఉన్నాయి. నూతన పట్టాదారులకు దాదాపుగా 6 గుంటలకు పైచిలుకు ఉన్న వాటిని మాత్రమే రిజిస్ట్రేషన్ చేసే తాసీల్దార్, 6 గుంటలకు తకువ ఉన్న ఆ ప్రైవేట్ వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయడంతో పెద్ద మొత్తంలోనే వసూలు చేసినట్లు తెలుస్తున్నది. సర్వేనంబర్ 2లోని అక్రమ పట్టా విషయంలోనే కాకుండా, ప్రొసీడింగ్స్ వంటి మరో కొన్ని పత్రాల తయారీ విషయంలో కూడా పక మండలం నుంచి సంబంధిత పత్రాలు సృష్టించినట్లు తెలుస్తున్నది. ఈ వ్యవహారంలో ఓ ప్రైవేటు వ్యక్తి కీలకపాత్ర పోషించినట్లు తెలిసింది.

ప్రైవేటు వ్యక్తులదే హవా..

తాసీల్దార్ కార్యాలయంలో ఏ పని జరగాలన్న ప్రైవేటు వ్యక్తులకు ఎంతో కొంత ముట్టచెబితే కానీ కాగితాలు కదలని పరిస్థితి నెలకొంది. దరఖాస్తు దారు నుంచి వచ్చే ప్రతి పైసా పై అధికారులకు చేరుతున్నట్లు, ఆ ప్రైవేటు వ్యక్తులు దరఖాస్తుదారులకు చెబుతున్నట్లు సమాచారం. కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా చలామణి అవుతున్న ఓ ప్రైవేట్ వ్యక్తి,త స్థానిక డీలర్ సహాయంతో ఇటీవల నూతన రేషన్ కార్డుల జారీలో భాగంగా ఒకో నూతన దరఖాస్తుదారు నుంచి రూ. 10 వేల నుంచి రూ. 15 వేల వరకు వసూలు చేసి, విచారణకు సంబంధించి, పై నుంచి కింది స్థాయి అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మరో వింత ఏంటంటే నూతన రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు దారుని వద్దకు సంబంధిత అధికారులు విచారణకు వెళితే, దరఖాస్తు దారుడు.. అప్పటికే తనకు కార్డు మంజూరైందని, ఇంకా విచారణ దేనికంటూ ఆ అధికారిని ప్రశ్నించినట్లు తెలిసింది.

నెలల తరబడి ఎదురుచూపులు

గతేడాది భారీ వర్షాలకు నీట మునిగిన పంటలు
తీవ్రంగా నష్టపోయిన బోధన్ డివిజన్ రైతులు
ఆదుకుంటామని హామీ ఇచ్చి మరిచిన ప్రభుత్వం
పంట నష్టంపై వ్యవసాయశాఖ నివేదిక బుట్టదాఖలు

శక్కర్‌నగర్ : రైతాంగ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నది. రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్.. వారి సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తున్నది. గతేడాది భారీ వర్షాలకు గోదావరి, మంజీరా పరీవాహక ప్రాంతాలతోపాటు ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ కారణంగా బోధన్ నియోజకవర్గంలోని పలు మండలాల్లోని పంటలు నీట మునిగాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతులకు పరిహారం అందిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం అధికారులతో ఆదరబాదరగా పంట నష్టంపై సర్వే చేయించింది. నియోజకవర్గంలో పంట నష్టం, నష్టపోయిన రైతుల వివరాలు సేకరించి వ్యవసాయశాఖ అధికారుల ద్వారా అంచనా వేయించింది. పంట నష్టం జరిగి సుమారు ఆరు నెలల కాలం పూర్తి కావస్తున్నా.. ఇప్పటివరకూ పరిహారం ఊసేలేదు. పరిహారం అందించడంలో ప్రభుత్వం పరిహాసం చేస్తున్నదని రైతుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. వందల ఎకరాలు నీట మునిగి, పూర్తిగా పంట నష్టం జరిగినా ఎంతో కొంత ప్రభుత్వం నుంచి పరిహారం అందు

తుందని ఆశిస్తున్న రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు. బోధన్, సాలూరా, ఎడపల్లి, రెంజల్, నవీపేట్ మండలాలకు చెందిన 21,763 మంది రైతులకు చెందిన 24,038 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు నిర్ధారించారు. నష్ట పరిహారం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినా, ఇంతవరకూ దాని గురించి పట్టించుకున్న దాఖలాలు లేవని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

అందని 'భరోసా'.. రైతుల్లో నిరాశ

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాట్లు వేసే సమయానికి రైతుబంధు డబ్బులు వచ్చేవని రైతులు గుర్తుచేసుకుంటున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా సకాలంలో, సక్రమంగా అందక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నదని వాపోతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టం వివరాల నివేదికను ప్రభుత్వానికి పంపారు. పంటనష్ట పరిహారంపై వ్యవసాయశాఖ అధికారులను అడిగినా, వారు ఏం చెప్పలేని పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని కోరుతున్నారు.

పంట నష్టపోయిన గ్రామాలు

బోధన్ మండలంలోని బిక్‌నెల్లి, హంగర్గ, కొప్పర్గ, సిద్దాపూర్ గ్రామ శివారు, సాలూరా మండలంలోని హున్సా, మందర్నా, ఖండ్‌గాంల శివారు, రెంజల్ మండలంలోని నీలా, కందకుర్తి, బోర్గాం, తాడ్‌బిలోలి, నవీపేట్ మండలంలోని కోస్లీ, యంచ, బినోల, నాళేశ్వర్ గ్రామాల్లో వరి, సోయాబీన్‌తో పాటు పలు అంతర పంటలు నీటి మునిగిపోయాయి. ఎడపల్లి మండలం జైతాపూర్ శివారులోని చిన్న రైతులకు చెందిన 51 ఎకరాల్లో వరిపంట నష్టం జరిగినట్లు అధికారులు సర్వేలో గుర్తించారు. వానకాలం పంట కాలం పూర్తయి, యాసంగి పంట కూడా త్వరలో చేతికి రానుండగా, ఇప్పటి వరకూ ప్రభుత్వం పరిహారం అందించకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

సొంతింటికి చేరిన
మాజీ మావోయిస్టు నేత మల్లోజుల
పెద్దపల్లిలోని కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా గడిపిన కోటేశ్వర్‌రావు

పెద్దపల్లి : మావోయిస్టు పార్టీ మాజీ పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తన ఇంటికి ఆదివారం చేరుకున్నారు. 44 ఏళ్ల పాటు సాయుధ పోరాటం జీవితం గడిపిన మల్లోజుల ఇటీవల తన భార్య తారతో కలిసి మహారాష్ట్ర సీఎం ముందు ఆయుధాలు అప్పగించి లొంగిపోయిన విషయం తెలిసిందే. అయితే అప్పటి నుంచి మల్లోజులకు మహారాష్ట్ర ప్రభుత్వం పోలీసు భద్రత కల్పిస్తున్నది. మల్లోజుల సోదరుడు మల్లోజుల అంజన్న ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. దీంతో అన్నను పరామర్శించేందుకు మల్లోజుల పెద్దపల్లికి వచ్చారు. చాలా కాలం తర్వాత పెద్దపల్లికి వచ్చిన మల్లోజులను కలిసేందుకు పెద్ద సంఖ్యలో బంధువులు, స్నేహితులు తరలివచ్చారు. కొంతసేపు కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి సరదాగా ముచ్చటించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని అందరితో కలిసి ఫోటోలు దిగారు. అయితే మల్లోజుల పర్యటనకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మల్లోజుల వెంట వచ్చిన మహారాష్ట్ర పోలీసు బృందం అక్కడి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచింది. అయితే మల్లోజుల వేణుగోపాల్ మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించారు.

జీడీకే-1 గనిలో ప్రొడక్షన్ డే విజయవంతం
భారీగా ఒకే రోజు 806 టన్నుల బొగ్గు ఉత్పత్తి

గోదావరిఖని : సింగరేణి సంస్థ రామగుండం డివిజన్ వన్ పరిధిలోని +ణఖ-1 ఇంక్లైన్ గనిలో శనివారం నిర్వహించిన ప్రొడక్షన్ డే విజయవంతంగా ముగిసింది. 2025 26 ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తి భారీగా వెనుకబడడంతో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించడానికి గాను సింగరేణి వ్యాప్తంగా చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా శనివారం జీడీకే-1 గనిలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధన దినోత్సవం పాటించారు. ఈ సందర్భంగా ఉద్యోగులందరూ అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తూ 806 టన్నుల అత్యధిక బొగ్గు ఉత్పత్తి సాధించడంతోపాటు 736 టన్నుల బొగ్గు రవాణా డిస్పాచ్‌తో 1.2 మీ సాధించింది. ఇటీవల సంవత్సరాల్లో ఇదే అత్యధిక రికార్డుగా నిలిచింది. ఒకరోజు నిర్దేశించిన లక్ష్యం 656 టన్నులు కాగా, 806 టన్నులు సాధించి లక్ష్యాన్ని మించి బొగ్గు ఉత్పత్తి సాధించింది. ఉత్పత్తితోపాటు రవాణాలో కూడా గణనీయమైన వృద్ధి సాధిస్తూ736 టన్నుల బొగ్గును రవాణా చేశారు. ఈ విజయాన్ని సాధించడం గని సిబ్బంది సమిష్టి కృషికి నిదర్శనంగా నిలిచింది. ఈ గొప్ప విజయానికి ఆర్‌జీ-1 జనరల్ మేనేజర్ డీ లలిత్ కుమార్, ఎల్ రమేష్ (ఏజెంట్), సుధీర్ జక్కులవార్ (మేనేజర్) గని అధికారులు, సూపర్వైజర్లు, ఉద్యోగులు యూనియన్ ప్రతినిధులు అందరిని అభినందిస్తూ భవిష్యత్‌లో కూడా ఇదే ఉత్సాహంతో మరింత ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఆకాంక్షించారు.

తల సేమియా చిన్నారుల కోసం..
గోదావరిఖనిలో మెగా రక్తదాన శిబిరం

కోల్ : తలసేమియా చిన్నారుల కోసం ఆలయ ఫౌండేషన్ వలంటీర్లు రక్తదానం చేశారు. ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి పుట్టిన రోజు సందర్భంగా మాజీ కార్పొరేటర్ ఐత శివకుమార్ ఆధ్వర్యంలో గోదావరిఖని ఎల్బీ నగర్ లో ఆదివారం మెగా రక్తదాన శిబిరం చేపట్టారు. ఫౌండేషన్ సభ్యులు, స్వచ్ఛంద సంఘాల సభ్యులు, యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ శిబిరం ద్వారా సుమారు 75 యూనిట్ల రక్తం సేకరించిన మంచిర్యాల రెడ్ క్రాస్ సొసైటీకి అందజేసినట్లు నిర్వాహకుడు ఐత శివ తెలిపారు. అలాగే రిటైర్డ్ ఆర్మీ సైనికులను శాలువాలతో సన్మానించి వారి సేవలను గుర్తు చేసుకున్నారు. సమాజ హిత కార్యక్రమాలు చురుకుగా చేపడుతున్న రామగుండం నియోజక వర్గ స్వచ్ఛంద సంఘాల ఐక్య వేదిక కార్యవర్గాన్ని సన్మానించి సేవలను కొనియాడారు. అలాగే లంక సురేశ్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ మధ్యప్రదేశ్ లో ఐఏఎస్ అధికారిగా ఉన్నత పదవిలో ఉండి కూడా పుట్టిన గడ్డను మరవకుండా తెలంగాణలో ఫౌండేషన్ స్థాపించి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్న పరికిపండ్ల సరహరి స్ఫూర్తిగా ఆయన పుట్టిన రోజున ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయని నిర్వాహకులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో విజయానంద్, గోలివాడ చంద్రకళ, కానుగంటి శ్రీనివాస్, లంక సురేశ్, శ్రీదేవి, సుజాత, సాయిలక్ష్మి, నాగరాజు, నిఖిల్, దేవ, శ్రీధర్, సతీష్, ఉదయ్, చారి, బెల్లి సంపత్, శ్రీనివాస్ తోపాటు అధిక సంఖ్యలో స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

బిజినెస్

యూజర్లు సేఫ్.. మోసాలకు చెక్!

భారతదేశంలోని ప్రముఖ టెలికమ్యూనికేషన్ సర్వీస్ ప్రొవైడర్లలో ఒకటైన భారతీ ఎయిర్‌టెల్ వినియోగదారులకు సురక్షితమైన మెసేజింగ్ అనుభవాన్ని అందించడానికి గూగుల్‌తో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకుంది. దీంతో ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ ఇంటెలిజెన్స్‌ను గూగుల్ రిచ్ కమ్యూనికేషన్స్ సర్వీసెస్ (=జూ) ప్లాట్‌ఫామ్ ఉ స్పామ్ ఫిల్టరింగ్‌తో కలపడం ద్వారా వినియోగదారులకు మెరుగైన రక్షణ కలిగిన మెసేజింగ్ సేవలను అందించనున్నారు. గత 1.5 సంవత్సరాలుగా.. ఎయిర్‌టెల్ స్పామ్ కాల్స్ అండ్ డిజిటల్ మోసాలపై పోరాడుతోంది. ఏఐ బేస్డ్ విధానాలను ఉపయోగించి కంపెనీ ఇప్పటి వరకు 71 బిలియన్ స్పామ్ కాల్స్, 2.9 బిలియన్ స్పామ్ ౠమీలను అడ్డుకుంది. దీంతో సంస్థ ఆర్థిక నష్టాల విలువ 68.7 వరకు తగ్గాయి. ఇది వినియోగదారుల పట్ల కంపెనీకున్న నిబద్ధతను స్పష్టంగా చూపిస్తుంది. అయితే.. టెలికాం నెట్‌వర్క్‌లకు ఉన్న భద్రతా ప్రమాణాలు ఇతర మెసేజింగ్ యాప్స్‌లో పూర్తిగా అమలు కావడం లేదు. దీనిని అదనుగా తీసుకుని కొందరు సైబర్ నేరగాళ్లు ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారు. స్పామ్ మెసేజస్ పంపిస్తున్నారు. ఇలాంటి వాటికి చెక్ పెట్టడానికి ఎయిర్‌టెల్.. గూగుల్‌తో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకుంది. మొత్తం మీద వినియోగదారుల భద్రతకు సంస్థ గొప్ప నిర్ణయం తీసుకుంది.

ఉపయోగాలు

సందేశం పంపిన వారి గుర్తింపును చెక్ చేయవచ్చు.

వినియోగదారుల డీఎన్‌డీ సెట్టింగ్స్‌కు అనుగుణంగా మెసేజ్‌లను ప్రకటన లేదా అవసరమైన మెసేజ్‌లుగా వేరు చేసుకోవచ్చు.

స్పామ్ బిజినెస్ మెసేజ్‌లు మీ ఫోన్‌కు రాకుండా చేసుకోవచ్చు.

హానికరమైన లేదా మోసపూరిత లింకులను ముందుగానే గుర్తించి బ్లాక్ చేసుకోవచ్చు.

ఐదేండ్లలో 500 నెక్సా స్టూడియోలు

కార్ల తయారీలో అగ్రగామి సంస్థ మారుతి సుజుకీ ఇండియా.. ప్రీమియం రిటైల్ చెయిన్ నెక్సాను భారీ స్థాయిలో విస్తరించబోతున్నది. 2030-31 నాటికి దేశవ్యాప్తంగా నెక్సా స్టూడియోల సంఖ్యను 700కి పెంచబోతున్నట్టు కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి పార్థో బెనర్జీ తెలిపారు. తన 200 అవుట్‌లెట్‌ను హర్యానాలో శుక్రవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ..కంపెనీ మొత్తం విక్రయాల్లో 25-30 శాతం చిన్నగా ఏర్పాటు ప్రీమియం రిటైల్ అవుట్‌లెట్ల నుంచి సమకూరుతుండటంతో వీటిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు. గడిచిన ఏడాదిన్నరలో ప్రతి మూడు రోజులకు ఒక నెక్సా స్టూడియో(అవుట్‌లెట్)ను ప్రారంభించినట్టు చెప్పారు. కంపెనీ మొత్తం విక్రయాల్లో నెక్సా నుంచి 40 శాతం సమకూరుతుండగా, మిగతా 60 శాతం అరెనా షోరూంల నుంచి లభిస్తున్నాయని తెలిపారు. చిన్న స్థాయిలో ఏర్పాటు చేయనున్న నెక్సా స్టూడియోల్లో ప్రీమియం అనుభూతి కల్పించనున్నట్టు, ముఖ్యంగా మెట్రోలు, ఈవీ చార్జింగ్ సదుపాయం కూడా ఈ స్టూడియోలో ఉంటుందన్నారు. ఇటీవల మార్కెట్లోకి విడుదల చేసిన తన తొలి ఈ-విటారా ఎస్‌యూవీ కోసం చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయబోతున్నది.

నయా కార్లు, ఫుల్ జోష్

మార్చిలో విడుదలకానున్న పలు మాడళ్లు

న్యూఢిల్లీ : దేశీయ రోడ్లపైకి మరికొన్ని కార్లు దూసుకుపోవడానికి సిద్ధమయ్యాయి. ఇప్పటికే పలు వాహనాలతో కొనుగోలుదారులను ఆకట్టుకున్న దేశీయ, అంతర్జాతీయ ఆటోమొబైల్ దిగ్గజాలు వచ్చే నెలలో మరిన్ని వాహనాలను విడుదల చేయబోతున్నాయి. వీటిలో లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్‌తోపాటు రెనో, ఆడీ, స్కోడా, టయోటా సంస్థలు ఉన్నాయి. చౌకైన ఎస్‌యూవీతోపాటు ప్రీమియం లగ్జరీ కార్లున్నాయి. వీటి వివరాలు..

రెనో డస్టర్ సరికొత్తగా..

ఫ్రెంచ్‌నకు చెందిన రెనో డస్టర్ మళ్లీ దేశీయ మార్కెట్లోకి అడుగుపెట్టబోతున్నది. మార్చి 17న ఈ కారును ప్రవేశపెడుతున్నట్టు రెనో ప్రకటించింది. 2022లో ఈ మాడల్‌ను ఉపసంహరించుకున్న సంస్థ మళ్లీ నాలుగేండ్ల తర్వాత అందుబాటులోకి తీసుకొస్తున్నది. రెండు టర్బో-పెట్రోల్ ఇంజిన్: 100 హెచ్‌పీ, 1 లీటర్, 163 హెచ్‌పీ, 1.3 లీటర్ ఫోర్-సిలిండర్‌తో తీర్చిదిద్దింది. ఈ రెండు మాడళ్లలో ఆరు మాన్యువల్ గేర్లు, ఇతర టెక్నాలజీ ఫీచర్లు ఉన్నాయి. వీటితోపాటు వచ్చే దీపావళి నాటికి 1.8 లీటర్ల ఇంజిన్ సామర్థ్యం కలిగిన మరో మాడల్‌ను కూడా తీసుకొస్తున్నది.

బెంజ్-వీ క్లాస్

జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్-బెంజ్..మరొకసారి వీ-క్లాస్ మాడల్‌ను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేయబోతున్నది. వచ్చేవారంలో విడుదల కానున్న ఈ కారు నాలుగేండ్ల క్రితం ఉపసంహరించుకున్నది. ఆరుగురు, ఎనిమిది మంది కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసిన ఈ కారును పెట్రోల్, డీజిల్ ఇంజిన్‌తో తీర్చిదిద్దింది. లెక్సస్ ఎల్ఎం, ఎంజీ ఎం9, టయోటా వల్ఫైరెలకు పోటీగా సంస్థ ఈ మాడల్‌ను తీసుకొస్తున్నది.

ఆడీ ఎస్‌క్యూ8

జర్మనీకి చెందిన మరో సంస్థ ఆడీ..ఎస్‌క్యూ8 మాడల్‌ను వచ్చే నెల 17న అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 4.0 లీటర్ ట్విన్-టర్బో వీ8, ఆర్‌ఎస్ క్యూ8 తయారైన ఈ మాడల్ కేవలం 4.1 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్నది. ఈ మాడల్‌లో 8 స్పీడ్ ఆటోమేటిక్ గేర్లు ఉన్నాయి.

స్కోడా కుషక్ ఫేస్ లిఫ్ట్

స్కోడా తన మాడల్ కుషక్‌ను మార్చి నెలలో విడుదల చేయబోతున్నది. డిజైనింగ్ పరంగా భారీ మార్పులు చేసిన ఈ మాడల్‌ను యువత కోరుకుంటున్న విధంగా తీర్చిదిద్దింది. పానోరామిక్ సన్‌రూఫ్, 115 హెచ్‌పీ 1 లీటర్ టర్బో-పెట్రోల్ ఇంజిన్, 8 స్పీడ్ గేర్లను ఆటోమేటిక్‌గా మార్చుకునే అవకాశం ఉన్నది. దీంతోపాటు 150 హెచ్‌పీల శక్తినివ్వనున్న 1.5 లీటర్ టర్బో మాడల్‌లో 7 స్పీడ్ డీసీటీ గేర్లు ఉన్నాయి.

టయోటా మరో ఈవీ

దేశీయంగా ఈవీలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని టయోటా మరో ఈవీని విడుదల చేయడానికి సిద్ధమైంది. 49 కిలోవాట్లు, 61 కిలోవాట్ల బ్యాటరీ సామర్థ్యంతో ఈ మాడళ్లను తయారు చేసింది. సింగిల్ చార్జింగ్‌తో 440 కిలోమీటర్ల నుంచి 543 కిలోమీటర్ల వరకు మైలేజీ ఇవ్వనున్నది. మారుతి ఇటీవల విడుదల చేసిన ఈ-విటారాకు పోటీగా సంస్థ ఈ మాడల్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నది.

1.52 కోట్లకు విమాన ప్రయాణికులు

దేశీయ విమానప్రయాణికులు భారీగా పెరుగుతున్నారు. జనవరి నెలలో 1.524 కోట్ల మంది ప్రయాణించారని పౌర విమానయాన నియంత్రణ మండలి డీజీసీఏ తన నివేదికలో వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే నెలలో ప్రయాణించిన వారితో పోలిస్తే 4.36 శాతం పెరిగారని తెలిపింది. వీరిలో ఇండిగో, ఎయిర్ ఇండియా గ్రూపు, స్పైస్‌జెట్, ఆకాశ ఎయిర్ విమానాల్లో 1.46 కోట్ల మంది ప్రయాణించారని తెలిపింది. పైలెట్లపై కఠిన నిబంధనల కారణంగా ఇండిగో మార్కెట్ వాటా 4 శాతం తగ్గి 63.6 శాతానికి పడిపోయింది. గత నెలలో ఇండిగో 97.04 లక్షల మంది విమాన ప్రయాణికులను తమ గమ్యస్థానానికి చేర్చింది. అలాగే ఎయిర్ ఇండియా మార్కెట్ వాటా కూడా 3 శాతం తగ్గి 26.5 శాతానికి పరిమితమైంది. జనవరి నెలలో ఆకాశ ఎయిర్ రికార్డు స్థాయి 93.2 శాతం సీటింగ్ కెపాసిటీతో విమాన సర్వీసులను నడిపింది. ఇండిగో 87.7 శాతం సీటింగ్ కెపాసిటీ కలిగివున్నది.

అదానీ గ్రీన్ ఎనర్జీకి నార్జెస్ బ్యాంక్ గుడ్‌బై!

తమ పోర్ట్‌ఫోలియో నుంచి అదానీ గ్రీన్ ఎనర్జీ(ఏజీఈఎల్)ను తప్పించనున్నట్లు నార్వేకు చెందిన సావరిన్ వెల్త్ ఫండ్ నార్జెస్ బ్యాంక్ పేర్కొంది. ఆర్థిక అవకతవకలకు సంబంధించిన ఆరోపణల నేపథ్యంలో షేర్లను విక్రయించనున్నట్లు తెలియజేసింది. ఇలాంటి ఆరోపణలతోనే 2024 మే నెలలోనూ సంస్థ అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ షేర్లను వదిలించుకుంది. నార్జెస్ బ్యాంక్ 2020 జూలైలో తొలిసారి ఏజీఈఎల్ షేర్లను కొనుగోలు చేసింది. షేరుకి రూ. 341 ధరలో వీటిని సొంతం చేసుకోగా.. ప్రస్తుతం షేరు రూ. 944 వద్ద కదులుతోంది. కాగా.. గతంలోనూ నార్వేజియన్ వెల్త్ ఫండ్ వివిధ కారణాలతో దేశీ బ్లూచిప్స్ ఐటీసీ, ఎల్‌అండ్‌టీ, ఎన్‌హెచ్‌పీసీ, ఎన్‌టీపీసీ, వేదాంతాలను పోర్ట్‌ఫోలియో నుంచి తప్పించింది.

శాసించిన శాంసన్.. సెమీఫైనల్లో భారత్

సంజు శాంసన్ 97నాటౌట్ 50 బంతుల్లో 12ఐ4, 4ఐ6 ఫామ్ పోయింది. అతడి ఓపెనింగ్ స్థానాన్ని ఇషాన్ కిషన్ కొట్టేశాడు. తుది జట్టులోనే చోటు లేకుండా పోయింది. అసలు ఆటగాడిగా అతణ్ని పట్టించుకునే వారే కరవయ్యారు. శాంసన్ అంటే.. చాలా మంది దృష్టిలో టీమ్‌ఇండియాకు దూరమయ్యే స్థితిలో ఉన్న ఆటగాడు. టి20 ప్రపంచకప్‌లో ఓ రెండు మ్యాచ్‌లాడినా పెద్దగా ముద్రేమీ వేయలేదు. ఈ నేపథ్యంలో అతడిపై అంచనాలూ లేవు.. ఆశలూ లేవు. అలాంటి శాంసన్.. ఆదివారం టీమ్‌ఇండియా ఆపద్బాంధవుడే అయ్యాడు. ఈడెన్ గార్డెన్స్‌లో అద్భుత బ్యాటింగ్‌తో డిఫెండింగ్ ఛాంపియన్‌ను సెమీఫైనల్‌కు తీసుకెళ్లాడు. చిరస్మరణీయ ఇన్నింగ్స్‌తో కోట్లాది అభిమానుల మనసులు గెలుచుకున్నాడు. శాంసన్ తొలి బంతి నుంచి కడ బంతి వరకు పోరాడిన వేళ.. క్వార్టర్‌ఫైనల్లాంటి పోరులో వెస్టిండీస్‌ను భారత్ ఓడించింది.

టీమ్‌ఇండియా టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. సంజు శాంసన్ (97 నాటౌట్; 50 బంతుల్లో 12ఐ4, 4ఐ6) అద్భుత బ్యాటింగ్‌తో ఆఖరి సూపర్ 8 మ్యాచ్‌లో ఆదివారం 5 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించింది. ఛేజ్ (40; 25 బంతుల్లో 5ఐ4, 1ఐ6), హోల్డర్ (37 నాటౌట్; 22 బంతుల్లో 2ఐ4, 3ఐ6) చెలరేగడంతో మొదట వెస్టిండీస్ 4 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. రోమన్ పావెల్ (34 నాటౌట్; 19 బంతుల్లో 3ఐ4, 2ఐ6), హోప్ (32; 33 బంతుల్లో 3ఐ4, 1ఐ6), హెట్‌మయర్ (27; 12 బంతుల్లో 1ఐ4, 2ఐ6) మెరిశారు. బుమ్రా (2/36) బంతితో రాణించాడు. శాంసన్‌తో పాటు తిలక్ వర్మ (27; 15 బంతుల్లో 4ఐ4, 1ఐ6) మెరవడంతో లక్ష్యాన్ని భారత్. 19.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

సంజు ఒక్కడు..: టీమ్‌ఇండియా హీరో సంజు శాంసనే. మొక్కవోని పట్టుదల, దృఢ సంకల్పంతో క్రీజులో నిలిచిన అతడు.. దాదాపు ఒంటి చేత్తో జట్టును విజయ తీరాలకు చేర్చాడు. కీలక మ్యాచ్‌లో, ఒత్తిడిలో, తనపై అంచనాలేమీ లేని స్థితిలో సంజు ఆడిన ఇన్నింగ్స్ అద్భుతం. ఇంకెవరూ 30 పరుగులు చేయకున్నా.. టీమ్‌ఇండియా విజయాన్నందుకుందంటే కారణం అతడి చిరస్మరణీయ ఇన్నింగ్సే. ఛేదనలో 10 ఓవర్లు ముగిసే సరికి టీమ్‌ఇండియా స్కోరు 98/2. హార్డ్ హిట్టర్లు అభిషేక్, ఇషాన్ కిషన్ చెరో పది పరుగులే చేసి ఔటైనా.. శాంసన్ తన సూపర్ బ్యాటింగ్‌తో జట్టును రేసులో నిలిపాడు. నియంత్రణ కూడిన దూకుడుతో అతడు ఇన్నింగ్స్‌ను నడిపించిన తీరు అద్భుతం. కళ్లు చెదిరే షాట్లతో అతడు స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. బౌలర్లకు చిన్న అవకాశమైనా ఇవ్వలేదు.

ఇన్నింగ్స్ తొలి రెండు ఓవర్లలో శాంసన్‌కు పెద్దగా ఆడే అవకాశం రాలేదు. మరోవైపు అభిషేక్ ఆత్మవిశ్వాసంతో కనిపించలేదు. తొలి పది బంతుల్లో 10 పరుగులే చేశాడు. మూడో ఓవర్ నుంచి మొదలైంది శాంసన్ జోరు. హోసీన్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లు, ఓ ఫోర్ కొట్టాడు. అయితే ఓ భారీ షాట్ ఆడబోయి అభిషేక్, ఊపు మీద కనిపించిన ఇషాన్ కిషన్ కొద్ది తేడాలో ఔట్ కావడంతో భారత్ 41/2తో నిలిచింది. కానీ వాళ్ల నిష్క్రమణ శాంసన్‌పై ఎలాంటి ప్రభావం చూపించలేదు. చక్కని స్ట్రోక్‌ప్లేను కొనసాగించాడు. మోటీ బౌలింగ్‌లో బౌండరీతో అర్ధశతకం (26 బంతుల్లో) పూర్తి చేశాడు. మరోవైపు కెప్టెన్ సూర్య కూడా చక్కగా బ్యాటింగ్ చేయడంతో ఛేదన సాఫీగా సాగింది. కానీ సూర్యను షామర్ జోసెఫ్ ఔట్ చేయడంతో 58 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది.

అనంతరం క్రీజులోకి వచ్చిన తిలక్.. ఏమాత్రం సమయం వృథా చేయలేదు. జోసెఫ్ తర్వాతి ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు దంచేశాడు. ఛేజ్ ఓవర్లో సిక్స్ కొట్టాడు. ఆఖరి ఆరు ఓవర్లలో భారత్ 60 పరుగులు చేయాల్సిన స్థితి. కానీ జోరుమీదున్న తిలక్‌ను హోల్డర్ ఔట్ చేయడంతో ఆట ఆసక్తికరంగా మారింది. మరోవైపు పట్టుదలగా నిలిచిన శాంసన్.. విండీస్ ప్రయత్నాలకు అడ్డుగా నిలిచాడు. భారత్‌పై ఒత్తిడి తేనివ్వలేదు. హార్దిక్‌తో కలిసి అడపాదడపా ఫోర్లు కొట్టేస్తూ జట్టును లక్ష్యం దిశగా నడిపించాడు.

ఆఖరి రెండు ఓవర్లలో భారత్‌కు 17 పరుగులు అవసరమయ్యాయి. భారత్ విజయం దాదాపు ఖాయమే అయినా.. 19వ ఓవర్ రెండో బంతికి హార్దిక్ ఔట్ కావడంతో కొంత ఉత్కంఠ తప్పలేదు. కానీ అదే ఓవర్లో దూబె రెండు ఫోర్లు కొట్టి.. విండీస్‌కు ఆశలపై నీళ్లు చల్లాడు. ఫినిషింగ్ టచ్ మాత్రం శాంసనే. ఆఖరి ఓవర్లో భారత్‌కు ఏడు పరుగులు అవసరం కాగా.. కళ్లు చెదిరే షాట్‌తో తొలి బంతిని స్క్వేర్ లెగ్‌లో సిక్స్‌గా మలిచిన అతడు.. తర్వాతి బంతిని మిడాన్‌లో బౌండరీకి తరలించి భారత్‌ను సంబరాల్లో ముంచెత్తాడు.

సలామ్ సంజు శాంసన్‌కు సూర్య అభివాదం

వెస్టిండీస్ ధనాధన్: అంతకుముందు వెస్టిండీస్ తన ప్రణాళికను పక్కాగా అమలు చేసింది. మొదటి అర్ధభాగంలో చక్కగా ఇన్నింగ్స్‌ను నిర్మించడం, ఆఖర్లో విరుచుకుపడడాన్ని అలవాటుగా మార్చుకున్న ఆ జట్టు.. ఈ కీలక మ్యాచ్‌లోనూ అదే ఆటను కొనసాగించింది. బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో కరీబియన్ జట్టు గట్టి లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్.. ఇన్నింగ్స్‌ను బాగానే ఆరంభించింది అనొచ్చు. ఓపెనింగ్ జంట మరీ విధ్వంసం సృష్టించకున్నా.. తర్వాత వచ్చే బ్యాటర్లు రెచ్చిపోవడానికి అనువుగా మంచి పునాదినే వేశారు. అయితే హోప్ ఎక్కువ దూకుడుతో ఆడలేకపోయినా.. చేజ్ మాత్రం బ్యాట్ ఝుళిపించాడు. చక్కని షాట్లతో బౌండరీలు సాధించాడు. పవర్‌ప్లేలో సూర్య.. బుమ్రా సహా నలుగురు బౌలర్లతో బౌలింగ్ చేయించినా వికెట్ దక్కలేదు. 8 ఓవర్లకు 66/0తో నిలిచింది వెస్టిండీస్. అర్ష్‌దీప్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో బౌలింగ్ దాడిని ఆరంభించినా.. ఆ తర్వాత పట్టు సడలించాడు. హార్దిక్ కూడా తన తొలి రెండు ఓవర్లలో 21 పరుగులిచ్చాడు. తన తొలి మూడు ఓవర్లలో 25 పరుగులిచ్చిన అక్షర్.. వికెట్ల వేటలో మాత్రం సఫలం కాలేకపోయాడు. బుమ్రా ఓ చక్కని అవకాశాన్ని సృష్టించాడు. కానీ ఛేజ్ ఇచ్చిన సులభమైన క్యాచ్‌ను అభిషేక్ వదిలేశాడు. చేజ్‌ను తేలికగా రనౌట్ చేసే అవకాశాన్ని వరుణ్ చక్రవర్తి వృథా చేశాడు. అయితే ఇక వెస్టిండీస్ గేర్ మారుస్తుంది అనుకుంటున్న దశలో హోప్‌ను బౌల్డ్ చేయడం ద్వారా... వరుణ్ ఆ జట్టును తొలి దెబ్బ తీశాడు. అయినా 11 ఓవర్లలో 99/1తో విండీస్ బలంగానే కనిపించింది. హెట్‌మయర్ 10 బంతుల్లో 25 పరుగులతో అప్పటికే జోరందుకున్నాడు. కానీ అద్భుతంగా బౌలింగ్ చేసిన బుమ్రా.. ఒకే ఓవర్లో హెట్‌మయర్‌తో పాటు ఛేజ్‌ను ఔట్ చేయడంతో భారత్ ఊపిరిపీల్చుకుంది. కాసేపటికి రూథర్‌ఫర్డ్‌ను హార్దిక్ వెనక్కి పంపడంతో ఇన్నింగ్స్ భారత్ నియంత్రణలోనే ఉన్నట్లనిపించింది. కానీ అక్కడి నుంచి కథ మారిపోయింది.

వెస్టిండీస్ తన గత మ్యాచ్‌ల్లోలాగే ఆఖర్లో విరుచుకుపడింది. చెలరేగి ఆడిన హోల్డర్, రోమన్ పావెల్.. అభేద్యమైన అయిదో వికెట్‌కు 35 బంతుల్లోనే 76 పరుగులు జోడించి, విండీస్‌కు మెరుగైన స్కోరును అందించారు. అర్ష్‌దీప్ పూర్తిగా గతి తప్పాడు. అతడు వేసిన ఇన్నింగ్స్ 16వ ఓవర్లో పావెల్ రెండు సిక్స్‌లు, ఫోర్ దంచేశాడు. ఓ వైడ్ బాల్ బౌండరీకి వెళ్లింది. ఆ ఓవర్లో ఏకంగా 24 పరుగులు వచ్చాయి. ఆఖర్లో బుమ్రా కూడా విండీస్ బ్యాటర్లను నియంత్రించలేకపోయాడు. 18, 20వ ఓవర్లలో కలిపి అతడు 26 పరుగులిచ్చాడు. చివరి అయిదు ఓవర్లలో వెస్టిండీస్ 70 పరుగులు రాబట్టింది. బుమ్రా మినహా భారత బౌలర్లది మరోసారి నిరాశాజనక ప్రదర్శనే. వరుణ్ చక్రవర్తి మళ్లీ విఫలం కాగా.. నియంత్రణలేని బౌలింగ్‌తో అర్ష్‌దీప్ ధారాళంగా పరుగులిచ్చాడు.

వెస్టిండీస్ ఇన్నింగ్స్: హోప్ (బి) వరుణ్ చక్రవర్తి 32; ఛేజ్ (సి) సూర్యకుమార్ (బి) బుమ్రా 40; హెట్‌మయర్ (సి) శాంసన్ (బి) బుమ్రా 27; రూథర్‌ఫర్డ్ (సి) శాంసన్ (బి) హార్దిక్ 14; రోమన్ పావెల్ నాటౌట్ 34; హోల్డర్ నాటౌట్ 37; ఎక్స్‌ట్రాలు 11 మొత్తం: (20 ఓవర్లలో 4 వికెట్లకు) 195; వికెట్ల పతనం: 1-68, 2-102, 3-103, 4-119; బౌలింగ్: అర్ష్‌దీప్ సింగ్ 4-0-43-0; హార్దిక్ 4-0-40-1; అక్షర్ పటేల్ 4-0-35-0; బుమ్రా 4-0-36-2; వరుణ్ చక్రవర్తి 4-0-40-1

భారత్ ఇన్నింగ్స్: అభిషేక్ (సి) హెట్‌మయర్ (బి) హోసీన్ 10; సంజు శాంసన్ నాటౌట్ 97; ఇషాన్ కిషన్ (సి) హెట్‌మయర్ (బి) హోల్డర్ 10; సూర్యకుమార్ యాదవ్ (సి) రూథర్‌ఫర్డ్ (బి) షామర్ జోసెఫ్ 18; తిలక్ వర్మ (సి) హెట్‌మయర్ (బి) హోల్డర్ 27; హార్దిక్ (సి) హోల్డర్ (బి) షామర్ జోసెఫ్ 17; దూబె నాటౌట్ 8; ఎక్స్‌ట్రాలు 12 మొత్తం: (19.2 ఓవర్లలో 5 వికెట్లకు) 199; వికెట్ల పతనం: 1-29, 2-41, 3-99, 4-141, 5-179; బౌలింగ్: అకీల్ హోసీన్ 2-0-22-1; ఫోర్డ్ 3-0-22-0; హోల్డర్ 4-0-38-2; మోటీ 2-0-18-0; రొమారియో షెపర్డ్ 2.2-0-34-0; షామర్ జోసెఫ్ 4-0-42-2; ఛేజ్ 2-0-18-0

బుచ్చిబాబుని రామ్ చరణ్ అస్సలు వదలట్లేదు

మెగాహీరో రామ్ చరణ్ లేటెస్ట్ సినిమా 'పెద్ది'. బుచ్చిబాబు దర్శకుడు. లెక్క ప్రకారం మార్చి 27న పాన్ ఇండియా వైడ్ రిలీజ్ అని ప్రకటించారు. కానీ షూటింగ్ ఇంకా పెండింగ్ ఉండేసరికి వాయిదా వేశారు. ఏప్రిల్ 30న థియేటర్లలో తమ మూవీ విడుదల కానుందని కొన్నిరోజుల క్రితం పోస్టర్ వదిలారు. తాజాగా ఓ వైపు చివరి దశ చిత్రీకరణ జరుగుతోంది. మరోవైపు డబ్బింగ్ కూడా మొదలుపెట్టేశారు. తాజాగా ఆ వీడియోని చరణ్.. తన సోషల్ మీడియాలో పంచుకున్నారు.

'ఏమది' అనే డైలాగ్ చెబుతున్న వీడియోని పోస్ చేసిన చరణ్.. ఇందులో దర్శకుడు బుచ్చిబాబుని కూడా ఓ రేంజులో ఆటాడుకున్నట్లు కనిపించాడు. 'చికిరి చికిరి పాటలో మోహిత్ చౌహన్ వాయిస్‌కి నువ్వు ఎంత యాక్టింగ్ చేశావంటే ఆయనే పాడాడా అని డౌట్ వచ్చిందయ్యా. నా డబ్బింగ్‌లో అలా యాక్ట్ చేయకు' అని చరణ్ తెగ ఏడిపించేశాడు. ఈ వీడియో ఫన్నీగా అనిపిస్తూ అభిమానుల్ని ఎంటర్‌టైన్ చేస్తోంది. 'పెద్ది' నుంచి వచ్చిన తొలి పాట 'చికిరి చికిరి' అద్భుతమైన రెస్పాన్స్ సొంతం చేసుకుంది. సోమవారం(మార్చి 02) ఈ మూవీ నుంచి రెండో సాంగ్ రిలీజ్ కానుంది. ఇకపోతే స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌తో తీసిన ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్. కన్నడ హీరో శివరాజ్ కుమార్ కీలక పాత్ర చేశారు. జగపతిబాబు, దివ్యేందు తదితరులు ఇతర కీలక పాత్రలు పోషించారు. ఏఆర్ రెహమాన్ సంగీతమందించారు.

పెళ్లిపై స్పందించిన త్రిష.. నచ్చిన వ్యక్తి దొరికినప్పుడేనంటూ ఆసక్తికర వ్యాఖ్యలు

దక్షిణాది సినీ పరిశ్రమలో రెండు దశాబ్దాలుగా అగ్ర కథానాయికగా వెలుగొందుతున్న త్రిష కృష్ణన్ మరోసారి తన వ్యక్తిగత జీవితం గురించి చేసిన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. నటనతో పాటు తన వ్యక్తిత్వంతోనూ ప్రత్యేక గుర్తింపు పొందిన త్రిష పెళ్లి, విడాకులు, సహజీవనం వంటి అంశాలపై గతంలో వెల్లడించిన అభిప్రాయాలు తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒక ఇంటర్వ్యూలో "మీ పెళ్లి ఎప్పుడు?" అనే ప్రశ్నకు త్రిష స్పష్టమైన సమాధానం ఇచ్చారు. "చాలామంది నన్ను పెళ్లి గురించి అడుగుతుంటారు. కానీ నాకు ఒకటే సమాధానం ఉంది. నాకు నచ్చిన, సరైన వ్యక్తి దొరికితేనే నేను పెళ్లి చేసుకుంటాను. ఒకవేళ అలాంటి వ్యక్తి దొరకకపోతే పెళ్లి జరగకపోయినా నాకు ఎలాంటి అభ్యంతరం లేదు," అని ఆమె తెలిపారు. త్రిష వ్యాఖ్యల్లో స్పష్టత, ఆత్మవిశ్వాసం కనిపించాయి. పెళ్లి అనేది కేవలం సమాజం కోసం తీసుకునే నిర్ణయం కాదని, జీవితాంతం కలిసి జీవించగలమనే నమ్మకం కలిగినప్పుడే ఆ అడుగు వేయాలని ఆమె అభిప్రాయపడ్డారు. "నేను పెళ్లి చేసుకుంటే అది విడాకుల వరకు వెళ్లకూడదని భావిస్తున్నాను. అందుకే తొందరపడి ఎలాంటి తప్పుడు నిర్ణయం తీసుకోను," అని త్రిష వివరించారు. తన స్నేహితుల్లో చాలామంది ఇష్టం లేని పెళ్లిళ్లు చేసుకుని బాధపడుతున్నారని, అలాంటి జీవితం తనకు వద్దని ఆమె స్పష్టం చేశారు.ఇష్టం లేని వ్యక్తితో కలిసి నరకం అనుభవించడం కంటే ఒంటరిగా ఉండటం మేలని త్రిష అభిప్రాయపడ్డారు. ప్రేమలో పడటం కంటే తన జీవితాన్ని పంచుకోగలిగే మంచి భాగస్వామి కావాలని, తనకు నచ్చిన వ్యక్తితో సంతోషంగా జీవించడమే తన లక్ష్యమని తెలిపారు. త్రిష చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట చర్చనీయాంశంగా మారాయి. ఆమె అభిప్రాయాలకు కొందరు మద్దతు తెలుపుతుండగా, మరికొందరు వివిధ కోణాల్లో స్పందిస్తున్నారు. అయితే పెళ్లి విషయంలో సమాజపు ఒత్తిడికి లోనుకాకుండా, తన నిర్ణయాన్ని తాను తీసుకోవాలనే సందేశాన్ని త్రిష స్పష్టంగా ఇచ్చారని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.ఇదిలా ఉంటే, త్రిష ప్రస్తుతం పలు ఆసక్తికర ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. కెరీర్ పరంగా వరుస అవకాశాలతో దూసుకుపోతూనే, వ్యక్తిగత జీవితం విషయంలో మాత్రం ఆచితూచి అడుగులు వేస్తున్నారని చెప్పాలి. కాగా, ఈ మధ్య విజయ్ డైవర్స్ ఇష్యూలో త్రిష పేరు బయటకు రావడం హాట్ టాపిక్ అయిన విషయం విదితమే.

అల్లు అర్జున్ అలా చెప్పేసరికి ఎగిరి గంతేశాను

సాధారణంగా యాంకర్స్, సీరియల్ నటులు.. సినిమాల్లో ఛాన్సులు దక్కించుకునేందుకు చాలానే కష్టపడుతుంటారు. వీళ్లలో కొందరికి అప్పుడప్పుడు ఊహించని అవకాశాలు దక్కుతూ ఉంటాయి. అలాంటి వాళ్లలో హరితేజ ఒకరు. 20కి పైగా సీరియల్స్‌లో నటించిన యాంకర్‌గానూ పలు ఈవెంట్స్ హోస్టింగ్ చేసింది. బిగ్‌బాస్ తొలి సీజన్‌లో పాల్గొని ఫినాలే వరకు వచ్చి మంచి గుర్తింపు తెచ్చుకుంది. తర్వాత వరసగా పలు తెలుగు సినిమాల్లో సహాయ పాత్రల్లో కనిపించింది. కొన్నిరోజుల క్రితం ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఈమె.. అల్లు అర్జున్ మూవీలో ఛాన్స్ రావడంతో తను ఎలాంటి సాహసం చేశానో బయటపెట్టింది. 'అల్లు అర్జున్ పక్కన స్లిమ్, ఫెర్ఫెక్ట్‌గా కనిపించాలని పెద్ద నిర్ణయం తీసుకున్నాను. 'డీజే'(దువ్వాడ జగన్నాథం)లో అవకాశం వచ్చిన తర్వాత స్లిమ్‌గా కనిపించాలని వరసగా 15 రోజులు ఆహారం తినడం మానేశాను. కేవలం లిక్విడ్ డైటే తీసుకున్నాను. దాంతో కొంత సన్నబడి సినిమాలో బాగానే కనిపించాను. షూటింగ్ రేపు ఉందనగా ముందురోజు ఉత్సాహంతో నిద్ర కూడా పట్టలేదు. ఇక సెట్‌లో జరిగిన సంఘటన అయితే జీవితంలో మర్చిపోలేని జ్ఞాపకం. సెట్‌కి వెళ్లగానే అల్లు అర్జున్,నా దగ్గరకు వచ్చి 'బిగ్‌బాస్'లో నీ ఫెర్ఫార్మెన్స్ చూశాను. నీ వర్క్ చాలా నచ్చింది' అని అన్నారు. ఆ మాట వినగానే ఎగిరి గంతేశాను' అని హరితేజ.. బన్నీతో పనిచేసిన అనుభవం గురించి చెప్పుకొచ్చింది. బిగ్‌బాస్ షో నుంచి బయటకొచ్చిన తర్వాత అఆ, రాజా ది గ్రేట్ తదితర సినిమాల్లో కాస్త గుర్తింపు ఉన్న పాత్రలు హరితేజ చేసింది. తర్వాత పెళ్లి చేసుకుంది. కొన్నాళ్ల క్రితమే కూతురు పుట్టడంతో ఫ్యామిలీ లైఫ్ ఎంజాయ్ చేస్తోంది. బిగ్‌బాస్ 8వ సీజన్?లో వైల్డ్ కార్డ్ ఎంట్రీగా మళ్లీ వచ్చింది గానీ పెద్దగా మెప్పించకలేకపోయింది. ఏదేమైనా బన్నీ గురించి చెప్పి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఒక్కటి తప్పితే మిగతా వాటి పరిస్థితి సేమ్

సాధారణంగా ఫిబ్రవరి నెలలో టాలీవుడ్ పెద్ద సినిమాలేం రిలీజ్ పెట్టుకోవు. ఎందుకంటే అంతకు కొన్నిరోజుల ముందే సంక్రాంతి ఉంటుంది. ఆ టైంలో స్టార్ హీరో తమ మూవీస్ విడుదల చేసి ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చేస్తుంటారు. దీంతో ఫిబ్రవరిలో దాదాపుగా మిడ్ రేంజ్ లేదా చిన్న చిత్రాలే విడుదల అవుతుంటాయి. ఈసారి కూడా అలానే వచ్చాయి కానీ ఓ సెంటిమెంట్ బ్రేక్ అయింది. ఇంతకీ ఏంటి విషయం? ఫిబ్రవరి తొలివారంలో చిన్న సినిమాలు చాలానే వచ్చాయి. వాటిలో కాస్తోకూస్తో చెప్పుకదగ్గది అంటే గుణశేఖర్ తీసిన 'యుఫోరియా'నే. చాన్నాళ్ల తర్వాత తన స్టైల్ మార్చి, ట్రెండీ యూత్ సబ్జెక్ట్‌తో మూవీ తీసినప్పటికీ ఫ్లాప్ అయింది. కమ్ బ్యాక్ ఇద్దామనుకున్నా సీనియర్ దర్శకుడికి నిరాశే ఎదురైంది. ఇవి కాకుండా విత్ లవ్, బరాబర్ ప్రేమిస్తా, ఆపరేషన్ పద్మ, బ్లడ్ రోజెస్, లగ్గం టైమ్, ఎర్రచీర తదితర మూవీస్ రిలీజయ్యాయి కానీ ఇవన్నీ కూడా డిజాస్టర్స్ అయ్యాయి. రెండోవారం విశ్వక్ సేన్-అనుదీప్ కాంబోలో 'ఫంకీ', సంతోష్ శోభన్ 'కపుల్ ఫ్రెండ్లీ' రిలీజ్ కాగా.. వీటిలో హిట్ అవుతుందనుకున్న ఫంకీ ఘోరమైన డిజాస్టర్ అయింది. ఏ మాత్రం అంచనాల్లేని 'కపుల్ ఫ్రెండ్లీ' సక్సెస్ అందుకుంది. హిట్ అనిపించుకుని ఊహించిన దానికంటే కాస్త ఎక్కువగాగనే కలెక్షన్స్ సొంతం చేసుకుంది. సీనియర్ నటుడు అర్జున్ దర్శకుడిగా మారి, కూతురినే హీరోయిన్‌గా పెట్టి తీసిన 'సీతా పయనం' కూడా ఫ్లాప్ అయింది. వీటితో పాటు అమరావతికి ఆహ్వానం, స్కై నిలవే కూడా ఏ మాత్రం నిలబడలేకపోయాయి. మూడోవారంలో సుహాస్ 'హే బలవంత్', నవాబ్ కేఫ్ మూవీస్ వచ్చాయి. వీటిలో సుహాస్ సినిమా బాగుందని అన్నారు గానీ జనాలు ఎందుకో దీన్ని లైట్ తీసుకున్నారు. ఇక నవాబ్ కేఫ్ అయితే తొలిరోజుకే ఫ్లాప్ టాక్ ముద్ర వేయించుకుంది. చివరి వారం శ్రీ విష్ణు హీరోగా నటించిన 'విష్ణు విన్యాసం' అనే కామెడీ మూవీ రిలీజైంది. సోలో విడుదల కావడంతో ఏమైనా కలిసొస్తుందేమో అనుకున్నారు. ఇందులో కామెడీ ఏ మాత్రం నవ్వేలా లేకపోవడంతో జనాలు దీన్ని కూడా రిజెక్ట్ చేసినట్లే కనిపిస్తున్నారు. రేపటికల్లా దీని అసలు రిజల్ట్ ఏంటనేది తేలుతుంది. ఓవరాల్‌గా ఫిబ్రవరి నెలలో 20 సినిమాలు, థియేటర్లలోకి వస్తే ఒక్క 'కపుల్ ఫ్రెండ్లీ' మాత్రమే ఆకట్టుకుంది. కానీ ఇది మరీ అంత సూపర్ హిట్ అయితే కాలేకపోయింది. గత కొన్నాళ్ల నుంచి తీసుకుంటే 2020లో భీష్మ, 2021లో ఉప్పెన, 2022లో డీజే టిల్లు, 2023లో సర్, 2024లో ఊరిపేరు భైరవకోన, 2025లో తండేల్.. సక్సెస్ కావడంతో పాటు మంచి వసూళ్లు కూడా అందుకున్నాయి. ఈసారి మాత్రం అలాంటి మ్యాజిక్ ఏ సినిమా విషయంలోనూ జరగలేదు. తద్వారా కొన్నేళ్ల పాటు సాగిన సెంటిమెంట్ బ్రేక్ అయింది!

PRINTED AND PUBLISHED BY KANUGULA SRINIVAS ON BEHALF OF VIPLAV MEDIA PVT. LTD. AT M/S SMIL YS ONLINE, H-NO : 6-7-48 VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY DIST, TELANGANA - 500070 AND PUBLISHED AT VIPLAV MEDIA PVT LTD. H-NO: 18-7-496 KANDIKAL GATE, CHARMINAR, HYDERABAD, TELANGANA - 500053. CEO & CHEIF EDITOR: VANGA NAGARAJU, EDITOR: VANGA VIPLAV. UDYAM- TS-02-0308842 PHONE NO: +919394517067, +918499094183.